# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :310 శనివారం 11-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/









## ఒకే వ్యక్తికి 2 చోట్ల ఓట్లు ఉంటే ఏడాది జైలు శిక్ష

- ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఈఆర్
- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాల అందజేత
- 'సర్' పొడిగింపు మా పరిధిలో లేదు : సీఈవో సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్ (జర్నలిస్టు డైరీ) జూలై 10

ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఈఆర్ చేపడుతున్నామని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలు అందిస్తున్నామని వెల్లడించారు.

ఈసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లోనూ సేవలు:

ప్రతి వ్యక్తికి రెండు ఎన్యుమరేషన్ పత్రాలు ఇస్తామని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. రెండు ఎన్యుమరేషన్ పత్రాలు నింపి, ఒకటి బీఎల్‌వోకు ఇవ్వాలన్నారు. రెండో ఎన్యుమరేషన్ పత్రాన్ని ప్రజల దగ్గరే ఉంచుకోవాలని చెప్పారు. ఎన్యుమరేషన్ పత్రాన్ని నింపి ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉంటుందని వెల్లడించారు. ఒకవేళ ఎన్యుమరేషన్ పత్రం ఇవ్వలేకపోతే ఫామ్-6

-మిగతా 2 లో



# ప్రాణహాని ఉన్నా స్వదేశానికి వెళ్లి లొంగిపోతా

### అరెస్టు చేసినా.. చంపినా సిద్ధమేనని వ్యాఖ్యలు

- డిసెంబరులో కోర్టు ఎదుట హాజరయ్యే యోచన
- అవామీ లీగ్ నేతలతో కలిసి స్వదేశానికి వెళ్లనున్న మాజీ ప్రధాని
- తల్లిదండ్రుల సమాధులున్న గడ్డపైనే చనిపోవాలని ఆకాంక్ష
- అప్పగింతపై భారత్‌కు బంగ్లా నుంచి వరుస లేఖలు
- మరణశిక్ష విధించినా ఆరోపణలను తోసిపుచ్చిన హసీనా
- భారత్‌లో ఆశ్రయం పొందిన ఏడాది తర్వాత కీలక ప్రకటన

2

పాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినా స్వదేశానికి వెళ్లి కోర్టు ఎదుట లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ప్రకటన చేశారు. తనను అరెస్టు చేసే అవకాశం ఉందని, చివరకు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చినా స్వదేశంలోనే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిన తర్వాత తనపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. తాను పుట్టిన గడ్డపైనే చివరి శ్వాస విడవాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా మాట్లాడుతూ.. ఈ డిసెంబరులో అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి స్వదేశానికి వెళ్లి న్యాయస్థానాల ఎదుట లొంగిపోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. తన అప్పగింత కోసం బంగ్లాదేశ్ అధికారులు భారత ప్రభుత్వానికి వరుసగా లేఖలు రాస్తున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే, ఈ విషయంపై బంగ్లాదేశ్ ప్రస్తుత ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 5న ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చిన షేక్ హసీనా ప్రస్తుతం ఇక్కడే ఆశ్రయం పొందుతున్నారు. నిరసనలను అణచివేయడంలో తన పాత్ర ఉందన్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు.

# మళ్లీ మేమే.

### 2029లో సాధారణ ఎన్నికలు

- ఫామ్ హౌస్ లో పాపాల భైరవుడు బందీ
- అసెంబ్లీ స్థానాలు 182, పార్లమెంట్ స్థానాలు 26కు పెంపు
- 117 అసెంబ్లీ, 20 పార్లమెంట్ స్థానాల్లో గెలుస్తాం
- బ్యాండుమేళం బ్యాచ్‌లా బీఆర్ఎస్ సర్వేలు
- మేడిగడ్డ కుంగితే ఖమ్మంలో 44 గ్రామాలు మునిగాయి
- రాజకీయాల కోసం కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలంటున్నారు
- ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ చింతకాని/బోనకల్

"వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ సాధారణ ఎన్నికలు 2028 డిసెంబరులో జరగవు. 2029 మే లేదా జూన్ మాసంలో జరుగుతాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26 కు పెరుగుతాయి. 119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి. 36 నెలల ముందుగానే వచ్చే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నా...182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వస్తుంది" అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భద్రాచలం రాములవారి మీద ఆన...ఈ మాట కోసం కాంగ్రెస్ కార్యకర్తలు రోజుకు 18 గంటలు పని చేస్తారు అని చెప్పారు. శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగిన 'రైతు ఆశీర్వాద సభ'లో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు

-మిగతా 2 లో

2028 చివర్లో అసెంబ్లీ ఎన్నికలు.. 2029 మేలోగా జమిలి ఎన్నికల అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాలు, లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతూ.. 182 అసెంబ్లీ స్థానాల్లో 117 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని, రైతులకు సంబంధించిన పలు సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తప్పదని విమర్శించిన సీఎం.. రాష్ట్ర ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు.





## ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర

- ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ హెచ్చరిక
- వాషింగ్టన్ నిర్ణయాన్ని ప్రభావితం చేసేందుకేనని అనుమానాలు

వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి ఇరాన్ ఇటీవల కొత్తగా కుట్ర పన్నిందని ఇజ్రాయిల్ నిఘా వ్యవస్థ వాషింగ్టన్‌కు తెలియజేసింది. ఇరాన్ -- అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనిశ్చితిలో పడిన నేపథ్యంలో ఈ సమాచారం మరింత ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉంది. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం... ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ నుంచి ఈ వారంలోనే హెచ్చరిక సందేశం వచ్చింది. ట్రంప్‌ను ఎలా హతమార్చాలన్న విషయంపై ఇరాన్ రూపొందిస్తున్న ప్రణాళికలకు సంబంధించిన సమాచారం అమెరికాకు గత కొన్ని వారాలుగా నిరంతరం అందుతూనే ఉంది. అయితే ఇజ్రాయిల్ నుంచి వచ్చిన హెచ్చరిక తాజాది. ఇది ఓ నిర్దిష్ట కుట్రకు

-మిగతా 2 లో



## ఇరాన్‌తో చర్చించడానికి రెడీ

- మాకు విజ్ఞప్తి చేయగా అంగీకరించాం: ట్రంప్
- మేం తలవంచం.. దాడి చేస్తే ప్రతిదాడి తప్పదు: ఇరాన్
- ఆగిన దాడులు.. మధ్యవర్తుల ముమ్మర ప్రయత్నాలు

నేషనల్ బ్యూరో:

ఇరాన్‌తో సీజ్‌ఫైర్ డీల్ ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, ఆ దేశంతో శాంతి చర్చలు జరపడానికి తాము సిద్ధమేనని వివరించారు. సంప్రదింపులు జరపాలని తమకు ఇరాన్ విజ్ఞప్తి చేసిందని, అందుకు తాము అంగీకరించామన్నారు. అదే సమయంలో గత నెల కుదిరిన సీజ్‌ఫైర్ ఒప్పందం ముగిసిందని కరాఖండిగా తేల్చి పేనట్టు వెల్లడించారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఆకస్మికంగా ఇరాన్‌పై యుద్ధం మొదలుపెట్టగా.. తీవ్ర పరిణామాల తర్వాత గత నెల ఓ అవగాహన ఒప్పందానికి వచ్చాయి. 60 రోజులపాటు సీజ్‌ఫైర్ ప్రకటించుకుని.. ఆ ఒప్పందాన్ని శాశ్వత శాంతి ఒప్పందంగా మార్చుకోవాలని అనుకున్నాయి. కానీ, హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేసిందని అమెరికా మళ్లీ ఎటాక్ చేసింది.

-మిగతా 2 లో

## చైనా డ్యామ్‌తో భారత్‌కు ముప్పు

- భూకంప పగులుపై ఆనకట్ట నిర్మిస్తున్న చైనా



2

# లక్ష ఉద్యోగాలు భర్తీ చేశాం

### విదేశీ జాబ్ మేళాను ఉపయోగించుకోవాలి


- నైపుణ్యాభివృద్ధి కోసం 20 ఏటీసీలు
- హుస్నాబాద్ అన్ని రంగాల్లో ముందుండాలి
- హుస్నాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల రావడం శుభపరిణామం: మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి
- జాబ్‌మేళా, అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హుస్నాబాద్ (జర్నలిస్టు డైరీ) జూలై 10

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్ష ఉద్యోగాలను భర్తీ చేశామని, బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలో రూ.45.15 కోట్లతో అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ), మండలంలోని ఉమ్మాపూర్ గ్రామంలో శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణాలకు మంత్రులు భూమిపూజ చేశారు.

-మిగతా 2 లో







అయోధ్య విరాళాల చోరీపై

## నేపాల్ ఆందోళన

- ఏడుగురి బృందాన్ని పంపనున్న జనక్‌పూర్ మందిర్

2లో



2లో

వణుకుతున్న

## ఉత్తరాది

- ముంచెత్తిన వర్షాలు.. విరిగిపడుతున్న కొండ చరియలు
- డబుల్ ఇంజిన్ సర్కార్లు వచ్చినా వీడని వరద కష్టాలు
- వణుకుతున్న ఉత్తరాది



## ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

- తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం
- మహిళా సాధికారతే లక్ష్యం.. రైతన్నకు అండగా ప్రభుత్వం
- రైతు కష్టాలు తీర్చేదే కాంగ్రెస్ ప్రభుత్వం
- తెలంగాణలో కాంగ్రెస్ అంటేనే కరెంటు, కరెంటు అంటేనే కాంగ్రెస్
- రైతు ఆశీర్వాద సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ (జర్నలిస్టు డైరీ) జూలై 10

రాష్ట్రాన్ని కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా, ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురం క్రాస్ రోడ్ లో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. గత పదేళ్లలో జరిగిన దోపిడీలను ప్రస్తావిస్తూ, ఇకపై రాష్ట్రాన్ని ఆశ్రయించిన "గుంటనక్కలను", "తోడేళ్లను" ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా ధనాన్ని బద్ధాయుతంగా

-మిగతా 2 లో

## ఒకే వ్యక్తికి 2 చోట్ల ఓట్లు ఉంటే ఏడాది జైలు శిక్ష

మొదటి తరువాయి

ఇవ్వాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోతే ఫామ్-6 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ పత్రాలు నింపవచ్చని చెప్పుకొచ్చారు. "ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రంలో జూన్ 10వ తేదీ నాటికి 3 కోట్ల 38లక్షలకు పైగా ఓటర్లున్నారు. అందులో మృతి చెందిన, వలస వెళ్లిన వాళ్ల ఓట్లను తొలగడానికే పూర్తి వివరాలు సేకరిస్తున్నాం. ఒక ఓటరుకు ఒకే ఓటు ఉండాలి. రెండుచోట్ల ఉంటే చట్టప్రకారం శిక్షార్హులవుతారు. ఈ నేరానికి ఏడాది జైలు శిక్ష ఉంటుంది. హైదరాబాద్, మేడ్చల్‌లో ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ కాస్త ఆలస్యమవుతోంది" - సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి. ఓటరుకు సమాచారం ఇచ్చాక ఓటు తీసెయ్యాలి : ఓటును కావాలనే తొలగించరని, అలా తొలగాలంటే అసామాన్య విషయం కాదని సీఈవో వెల్లడించారు. ఓటు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు సమాచారం ఇచ్చే తీసెయ్యాలని స్పష్టం చేశారు. "ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్ల ప్రకారం పంపిణీ చేయడంలో కొన్ని ఇబ్బందుల వల్ల పత్రాల పంపిణీలో ఆలస్యం అవుతోంది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ముగిసింది. ప్రస్తుతం తెలంగాణతో కలిపి 17 రాష్ట్రాల్లో కొనసాగుతోంది. రోహింగ్యాలకు ఓటు హక్కు ఉన్నట్లు తెలితే ఈఆర్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం ఓట్లను తొలగిస్తారు. 'సర్' గడువు పొడిగింపు మా పరిధిలో లేని అంశం." అని, ముఖ్య ఎన్నికల అధికారి - సుదర్శన్ రెడ్డి చెప్పారు.

## ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర

మొదటి తరువాయి

సంబంధించింది.

నివేదికపై అనుమానాలు

ఇరాన్‌పై సైనిక చర్యను తీవ్రతరం చేయాలా వద్దా అనే విషయంపై ట్రంప్ ఆలోచిస్తున్న తరుణంలో ఆయన నిర్ణయాన్ని ప్రభావితం చేసేందుకే ఇజ్రాయిల్ ఈ నివేదికను అందించి ఉండవచ్చునని అమెరికా అధికారులు కొందరు అనుమానిస్తున్నారు. ఇజ్రాయిల్ బయటపెట్టిన కుట్రకు సంబంధించిన వివరాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఇరాన్ ప్రయత్నాలను ట్రంప్ తొలుత పెద్దగా పట్టించుకోలేదు. వాటిపై నిఘా కూడా పెట్టలేదు. అయితే 2020లో ట్రంప్ ఆదేశాల మేరకు జరిగిన డ్రోన్ దాడిలో ఇరాన్ అగ్రశ్రేణి జనరల్ ఖాసిమ్ సోలైమనీ మరణించినందుకు ప్రతీకారంగా ట్రంప్‌ను చంపడానికి టెహ్రాన్ ప్రయత్నించవచ్చునని అమెరికా ప్రభుత్వం అనుమానించింది. తనను చంపాలని భావిస్తున్న ఇరాన్‌పై ట్రంప్ ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలను అధ్యక్షభవనం ప్రస్తావించింది. 'వారు అమెరికా నేతను...అంటే నన్ను అంతం చేయాలని అనుకుంటున్నారు' అని ట్రంప్ చెప్పారు. తాను ఇరాన్ హిట్‌లిస్టులో ఉన్నానని తెలిపారు. తన హత్యే లక్ష్యంగా ఇరాన్ రూపొందించిన ఓ జాబితా గురించి ఇటీవలే తనకు తెలిసిందని అన్నారు. అయితే ఆ సమాచారం ఎలా వచ్చిందనేది వెల్లడించలేదు. అయితే ట్రంప్ నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ఇజ్రాయిల్ ఈ నివేదికను తెర పైకి తెచ్చిందా అనే సందేహాలు కూడా కలుగుతున్నాయి. అమెరికా నిఘా వర్గాల్లో కొందరు ఇజ్రాయిల్ నివేదికలను ఎప్పుడూ అనుమానంగా చూస్తూనే ఉంటారు. ఇరాన్‌తో దౌత్యం కోసం ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ బహిరంగంగానే నిప్పులు చెరుగుతున్నారు. లెబనాన్‌లో సైనిక చర్య విషయంలో ఆయన ట్రంప్‌తో విభేదించారు.

## ఇరాన్‌తో చర్చించడానికి రెడీ

మొదటి తరువాయి

పూర్తిస్థాయి యుద్ధానికీ సిద్ధమే: గాలిబాఫ్

అమెరికాతో యుద్ధం ఇరాన్ లొంగుబాటుతో ముగుస్తుందని భావిస్తే పొరబడినట్టేనని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ గాలిబాఫ్ స్పష్టం చేశారు. ఇరాన్ తలవంచే ప్రసక్తే లేదన్నారు. గత నెల కుదిరిన అవగాహన ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగినా తమ దేశాన్ని, తమ ప్రజలను తాము రక్షించుకోగలమని వివరించారు. మోసపూరితంగా అమెరికా దాడులకు తెగబడ్డ పూర్తిస్థాయి యుద్ధానికి తాము రెడీ అని తెలిపారు. ఈ యుద్ధ ముగింపు అనేక దేశాలకు ముఖ్యమని, కానీ, ఎవరూ ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలని, ఈ యుద్ధం ముగియడానికి ఇరాన్ లొంగిపోబోదని స్పష్టం చేశారు. కాగా, చర్చలకు రెడీ అని ట్రంప్ చేసిన ప్రకటనపై ఇరాన్ అధికారులు కటువుగా స్పందించాయి. అమెరికా ఇచ్చిన హామీలకు, అంగీకరించిన నిబంధనలకు కట్టుబడి ఉండటం లేదని వివరించారు. మళ్లీ చర్చలు మొదలుపెట్టడానికి ముందు ఇదివరకు ఇచ్చిన హామీలకు ముందుగా కట్టుబడి ఉండాలన్నారు. మళ్లీ అమెరికా దాడి చేస్తే తాము ఉపేక్షించేది లేదని, ప్రతిస్పందనగా తాము తప్పకుండా దాడి చేస్తామని ఐఆర్జీసీ హెచ్చరించింది.

ఇరాన్‌కు ఖతర్ టీం

రెండు రోజులపాటు దాడులు జరగ్గానే మధ్యవర్తులు వెంటనే రంగంలోకి దిగారు. ఇరాన్ నాయకత్వంతో చర్చించి ఉద్రిక్తతలు తగ్గించడానికి ఖతర్ మధ్యవర్తుల బృందం ఇరాన్‌కు వెళ్లినట్టు తెలిసింది. ఖతర్, ఈజిప్ట్ నేతలు మళ్లీ సీజ్‌ఫైర్ కొనసాగించే సాధ్యాసాధ్యాలపై చర్చించినట్లు సమాచారం. కాగా, పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ దాడులపై తీవ్ర ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. వెంటనే అమెరికా, ఇరాన్‌లు దాడులు మానుకుని మళ్లీ సీజ్‌ఫైర్ పాటించాలని మధ్యవర్తులు ఒత్తిడి చేస్తున్నారు.

నాకేమైనా జరిగితే... : ట్రంప్


ఖమేనీ అంత్యక్రియల్లో ట్రంప్‌ను చంపుతామనే నినాదాలపై ప్రశ్నలు వేయగా.. చాలా ఏళ్లుగా వారి టార్గెట్ తాను ఉన్నానని, ఆ విషయం తనకు తెలుసని ట్రంప్ వివరించారు. తన హత్యకు ఇరాన్ కుట్ర పన్నిందని ఇజ్రాయెల్ సమాచారం ఇచ్చిందన్న వార్తలను ప్రస్తావించగా.. వారు కొత్తగా ఇచ్చిన సమాచారమేమీ లేదని తెలిపారు. అదే సమయంలో ఒకవేళ తనకేమైనా జరిగితే.. ఇరాన్ ఎన్నడూ చూడని స్థాయిలో బాంబులతో విరుచుకుపడాలని తాను ఇది వరకే బలగాలకు ఆదేశాలు ఇచ్చానని వివరించారు.

హార్ముజ్ జలసంధిపై రగడ

గత నెల కుదిరిన ఒప్పందంలో హార్ముజ్ జలసంధిని ఒమన్‌తో సమన్వయంతో తామే మేనేజ్ చేస్తామని ఇరాన్ పేర్కొంది. ఇప్పుడు ఈ ఒప్పందంపైనే విభేదాలు నెలకొన్నాయి. ఇరాన్ సూచనల మేరకే హార్ముజ్‌లో నౌకలు వెళ్లాలని కచ్చితత్వం ఇందులో లేదు. కానీ, హార్ముజ్‌లో తాము సూచించిన మార్గాల్లోనే నౌకలు ప్రయాణించాలని ఇరాన్ వాదిస్తోంది. అమెరికా నియంత్రణలోని ఒమన్ సమీపంలోని మార్గం గుండా వెళ్తే దాడి చేస్తున్నది. ఇది అమెరికాకు ఆగ్రహాన్ని తెప్పించింది.

## చైనా డ్యామ్‌తో భారత్‌కు ముప్పు

**భూకంప పగులుపై ఆనకట్ట నిర్మిస్తున్న చైనా**



బీజింగ్

చైనా చేపడుతున్న భారీ డ్యామ్ నిర్మాణంతో భవిష్యత్తులో భారత్‌కు ముప్పు తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ విషయాన్ని చైనా శాస్త్రవేత్తలే చెప్పారు. యార్లుంగ్ సాంగ్‌పో నదిపై (ఇండియాలో బ్రహ్మపుత్ర నది) ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మించేందుకు చైనా ప్రయత్నిస్తోంది. అయితే ఈ డ్యామ్ నిర్మాణ స్థలం హిమయుగం నుంచి కదులుతున్న ప్రధాన భూకంప రేఖ (భూకంప పగులు) పైనే ఉందని చైనా శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఫైజెన్ ఫాల్ట్ అనే భూకంప రేఖ ఈ డ్యామ్ కింద నుంచే వెళ్తోంది. భూకంపానికి అనువైన చోట అంత పెద్ద డ్యామ్ కడితే భవిష్యత్‌లో భారీ ప్రమాదాలు జరుగుతాయని చైనా సైంటిస్టులు చెబుతున్నారు. ఇప్పటికీ భూకంపాలకు అణువుగా చురుగ్గా ఉంది. 2017లో టిబెట్‌లో భూంకపాలను ఇందుకు నిదర్శనంగా సైంటిస్టులు చెబుతున్నారు. ఈ డ్యామ్ కడితే ఒకేసారి భారీగా నీటి విడుదల, ప్రకృతి విపత్తుల లాంటి ప్రమాదాలపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిపై సంప్రదింపులు జరపాలని భారత్ కోరినా చైనా ముందుకు రావట్లేదు.

# ప్రాణహాని ఉన్నా స్వదేశానికి వెళ్లి లొంగిపోతా

- డిసెంబరులో కోర్టు ఎదుట హాజరయ్యే యోచన
- అవామీ లీగ్ నేతలతో కలిసి స్వదేశానికి వెళ్లనున్న మాజీ ప్రధాని
- తల్లిదండ్రుల సమాధులున్న గడ్డపైనే చనిపోవాలని ఆకాంక్ష
- అప్పగింతపై భారత్‌కు బంగ్లా నుంచి వరుస లేఖలు
- మరణశిక్ష విధించినా ఆరోపణలను తోసిపుచ్చిన హసీనా
- భారత్‌లో ఆశ్రయం పొందిన ఏడాది తర్వాత కీలక ప్రకటన



**న్యూఢిల్లీ:**

తాను స్వదేశానికి వెళ్లి కోర్టు ముందు లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడ తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ.. స్వదేశానికి వెళ్లే యోచనలో ఉన్నానని చెప్పారు. ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను అరెస్టు కావడానికి లేదా చావడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అయితే, ఈ విషయంపై బంగ్లా ప్రస్తుత ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని హసీనా స్పష్టం చేశారు. "స్వదేశానికి వెళ్లిన తర్వాత వాళ్లు నన్ను అరెస్టు చేయొచ్చు. చంపేసే అవకాశమూ ఉంది. అయినా నేను వెళ్లాలి. నా పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్రమైన అణచివేతకు గురవుతున్నారు. మరణం సంభవిస్తే.. నా తల్లిదండ్రులను ఖననం చేసిన చోట, నా సొంత గడ్డపైనే చనిపోవాలని కోరుకుంటున్నా" అని హసీనా పేర్కొన్నారు. ఏదేమైనా ఈ డిసెంబర్లో తనతో పాటు అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేతలు స్వదేశానికి వెళ్లి కోర్టుల్లో లొంగిపోవాలని అనుకుంటున్నామని చెప్పారు. తన అప్పగింతపై భారత ప్రభుత్వానికి బంగ్లా అధికారులు అనేక లేఖలు రాస్తున్నారని.. ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో ఆగస్టు 5, 2024న దేశం విడిచి భారత్కు వచ్చిన షేక్ హసీనా ఇక్కడే ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. అయితే, నిరసనలను అణచివేయడంలో మాజీ ప్రధాని పాత్ర ఉందంటూ ఆమెపై అక్కడ అనేక కేసులు నమోదయ్యాయి. హసీనా వాటిని తోసిపుచ్చారు. విచారణ జరిపిన బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్.. 2025లో ఆమెకు మరణశిక్ష విధించింది. అయితే, స్వదేశం వెళ్లేందుకు సిద్ధమేనని ఇటీవల మీడియాతో ఆమె చెప్పినప్పటికీ.. కచ్చితమైన సమయం (డిసెంబర్లో వెళ్లానని)పై మాత్రం ఇప్పుడే స్పష్టత ఇచ్చారు. ఇదిలాఉంటే, హసీనాను అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం భారత్ను అనేకసార్లు కోరగా.. ఆ విషయంలో న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

## మళ్లీ మేమే...

మొదటి తరువాయి

భట్టి విక్రమా ర్క, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంక టరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, రామసాయం రఘు రాంరెడ్డి, బలరాంనాయక్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మెన్లు ఈ సభలో పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి సీఎం రేవంత్‌రెడ్డి 1.44 లక్ష?ల మంది రైతుల ఖాతాల్లో రూ.1009.15 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేశారు. అలాగే రైతులకు ఇ-పట్టాదార్ పాస్ పుస్తకాలను అంద చేశారు. ఈ సందర్భం గా సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 2023 లో ప్రభుత్వ ఏర్పాటు నుంచి ప్రతి ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించి, పాపాల భైరవుడిని ఫామ్ హౌస్ లోనే బందీ చేశారని చెప్పారు. జరగబోయే కురుక్షేత్రంలో కౌరవ కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీ య ముఖచిత్రం నుంచి పాతా ళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరని అన్నారు. రాజకీయంగా పాలమూరు తనకు ప్రాణమైతే, ఖమ్మం జిల్లా గుండె లాంటిదన్నారు. బీఆర్ఎస్ అధినేత కే చంద్ర శేఖర్ రావు (కేసీఆర్) దొంగ సర్వేలు చేయించుకొని, ఆత్మతృప్తి పొందుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ దొంగ సర్వేలు చేసే దొంగ ఏజెన్సీలు ఒక్క విషయం గుర్తు పెట్టుకోలంటూ ఎన్నికలు 2029లో జరుగుతాయని తెలిపారు. కేసీఆర్ కుటుంబంలో ఒకరిపై ఒకరికి నమ్మకం లేదనీ, ఒకే ఇంట్లో రెండు గుంపులు ఉన్నాయని ఎద్దేవా చేశా రు. "ఒకాయన కన్నె పల్లికి పోయి పంపులు ఆన్ చేయాలంటాడు. ఒకసారి మేడిగడ్డ కుంగితేనే ఖమ్మం జిల్లాలో 44 ఊర్లు కొట్టుకుపోయాయి. మళ్లీ నీళ్ల నింపితే భద్రాచలం రాముడు మునుగుతాడు" అని హెచ్చ రించారు. మీ దుష్ట రాజకీయాల కోసం మేడిగడ్డ నింపాలా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చేసుకున్న సర్వేలో కాంగ్రెస్ ఓడిపో తుందనే దుష్ప్రచారానికి దిగారనీ, ఎన్నికలు ఎప్పుడో, రిజర్వేషన్లు ఎలా మారుతాయో తెలియకుండా ఎవరైనా సర్వేలు చేస్తారా.. గెలుపు ఓటములు నిర్ణయిస్తారా? అని అడిగారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో ఇలాగే చెబితే జనం బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టార న్నారు. బ్యాడుమేళం బ్యాచ్ లా బీఆరెస్ సర్వేల బ్యాచ్ తయారైందని ఎద్దేవా చేశారు. బీజేపీ లోకి వెళ్ళనని హరీశ్ రావు కేసీఆర్ పై ఒట్టేసి చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారనీ, ఆంధ్రా కాంట్రాక్టర్లు బీఆర్ఎస్‌కు వందల కోట్లు ఇచ్చారని కేసీఆర్ సొంత కూతురు, కేటీఆర్ సొంత చెల్లెలే చెబు తున్నదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అమలు చేసిన షాది ముబారక్, రైతు బందు పథకాలను తాము కొనసాగి స్తున్నామని చెప్పారు. ప్రతి పేదవాడికి రేషన్ కార్డు, సన్న బియ్యం, 200 యూ నిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని గుర్తుచేశారు. రైతు భరోసాను రూ. 12 వేలకు పెంచి, రైతు రుణమాఫీ అమలు చేశామని వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ నుంచి 26 పార్లమెంట్ స్థానాలకు 20 పార్లమెంట్ స్థానాలు గెలిపించి, రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరినట్టు మధిరకు ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు చేస్తామన్నారు. ఈ బహిరంగ సభకు భారీగా జనం హాజరయ్యారు.

## లక్ష ఉద్యోగాలు భర్తీ చేశాం

మొదటి తరువాయి

అనంతరం జాబ్‌మేళా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ రావడం శుభపరిణామమన్నారు. తెలంగాణ వచ్చాక పదేండ్లు యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసిందన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ఇప్పటికే లక్ష ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రైజింగ్‌లో మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమితో ముందుకు పోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 120 ఏటీసీలు ప్రారంభించాలని ప్రభుత్వం భావించిందన్నారు. ఒక్కో ఏటీసీ రూ.45 కోట్లు కాగా మొత్తం రూ.4500 కోట్లతో ఈ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ టాటా కంపెనీతో మాట్లాడి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.4వేల కోట్లతో ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్‌లో ఏటీసీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ కాలేజీ కోసం హాస్టల్ నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలపమెంట్, ఇతర దేశాల భాషను నేర్పి విదేశాలకు పంపించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. విదేశాల్లో సుమారు 5 లక్షల ఉద్యోగ అవకాశాలున్నాయని తెలిపారు. విదేశీ జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలని కోరారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాల పెడతామని ప్రియాంక గాంధీ హామీ ఇచ్చిన మేరకు మంజూరు చేశామన్నారు. రూ.15 కోట్లతో విద్యార్థులకు హాస్టల్ భవనాలు, యూనివర్సిటీ పరిపాలన అనుమతులు వచ్చాయన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం పూర్తి చేసుకొని రెండో సంవత్సరం ప్రారంభం అయ్యేలోపు భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఏడాదిలోపు భవనాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. హుస్నాబాద్‌లో పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కాలేజీ, ఎల్లమ్మ చెరువు పర్యాటకంగా అభివృద్ధి చెందే పనులు జరుగుతున్నాయన్నారు.

ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల కోసం రూ.220 కోట్లు కేటాయించిందన్నారు. హుస్నాబాద్‌లో 250 పడకల ఆస్పత్రి పనులు నడుస్తున్నాయన్నారు.

హుస్నాబాద్ ఐటీఐ ఆధునిక సాంకేతిక శిక్షణా కేంద్రంగా మారి, స్థానిక యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మెన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సీపీ రష్మీ పెరుమాళ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, మార్కెట్ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ బంకచందు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చిత్తారీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వణుకుతున్న ఉత్తరాది



న్యూఢిల్లీ

ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడడం తో పలువురు మృతి చెందారు. దేశ రాజధాని ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో 160 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. సూరత్‌లో రహదారులు జలమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.శుక్రవారం ఉత్తరాఖండ్ లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలకనంద, మందాకిని నదులు ఉప్పొంగుతుండడంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలోని పాఠశాలలను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. 75 రోడ్లు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయని.. 29 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించింది.అలాగే ఉ త్తరకాశి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో గంగోత్రి హైవే మూసుకుపోయి.. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో చార్‌ధామ్ యాత్ర కు కొన్ని గంటలపాటు అంతరాయం కలిగింది.

## అయోధ్య విరాళాల చోరీపై నేపాల్ ఆందోళన

**ఏడుగురి బృందాన్ని పంపనున్న జనక్‌పూర్ మందిర్**



జనక్‌పూర్

అయోధ్య రామాలయంలో కానుకల చోరీ జరిగిందన్న విషయం నేపాల్‌లోని జనక్‌పూర్ భక్తులను కలవర పెట్టింది. జనక్‌పూర్‌ను సీతాదేవి జన్మస్థలంగా, శ్రీరాముని అత్తవారి ఇల్లుగా భావిస్తారు. అక్కడి జానకీ ఆలయ మహంత్ రోషన్ దాస్ ఈ విషయమై మాట్లాడుతూ ఏ రామాలయంలో ఇలాంటి ఘటన జరిగినట్టు తాను వినలేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. తాజా పరిస్థితిపై అయోధ్య ఆలయ అధికారులను సంప్రదించినట్టు తెలిపారు.జనక్‌పూర్ నుంచి 5-7 ఏడుగురు సభ్యుల బృందం శ్రావణ మాసంలో అయోధ్యకు వెళ్లి మద్దతు తెలిపి తిరిగి వస్తుందని ఆయన తెలిపారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం జరిగినప్పుడు జనక్‌పూర్ తరపున పలు విలువైన కానుకలను బహూకరించారు. చోరీ తర్వాత విరాళాల్లో పెరిగిన చిన్న నోట్లు చోరీ ఉదంతం తర్వాత రామాలయానికి వచ్చే విరాళాల్లో 10, 20 రూపాయల నోట్ల సంఖ్య పెరిగిందని అధికారులు తెలిపారు. రామాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరి కాల్ రికార్డును దర్యాప్తు చేయాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. అక్కడ ఉద్యోగుల్లో 99.99 శాతం మందికి బీజేపీతో సంబంధాలున్నాయని తెలిపారు.

## ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

మొదటి తరువాయి

కాపాడుతూ, రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచుతామని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రివర్గం మొత్తం గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినవారేనని, అందుకే క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూనే, రాష్ట్ర భవిష్యత్తు కోసం దార్శనిక నిర్ణయాలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. అవినీతికి తావు లేకుండా, పారదర్శకమైన పాలన అందిస్తూ రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా మారుస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళలను మహాలక్ష్ములుగా గౌరవించడం మరియు రైతన్నను రాజును చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఉద్ఘాటించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన వడ్డీ లేని రుణాల పథకాన్ని పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విస్మరించారని, కానీ తాము అధికారంలోకి రాగానే మహిళల కోసం ఆ పథకాన్ని తిరిగి యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నామని చెప్పారు. ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే రెండున్నర సంవత్సరాల్లోనే సుమారు 67 వేల కోట్ల రూపాయలను మహిళలకు అందించామని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచామని, మహిళల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించామని గుర్తు చేశారు. పవర్ ప్రాజెక్టులు, పెట్రోల్ పంపులు, క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సుల కొనుగోలు వంటి రంగాల్లో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది, వారిని కోటీశ్వరులుగా చూడటమే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వ్యవసాయాన్ని కేవలం ఒక వృత్తిగా కాకుండా మన సంస్కృతిగా, జీవన విధానంగా భావిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు ఇచ్చే నిధులు ఉచితాలు కావని, రాష్ట్ర స్థూల ఉత్పత్తికి అవసరమైన పెట్టుబడులని వివరించారు. గతంలో బీ ఆర్ ఎస్ పాలకులు ఎకరానికి 5 వేల రూపాయల చొప్పున రైతు బంధు డబ్బులను 140 నుంచి 160 రోజులలో ఇచ్చి గొప్పలు చెప్పుకున్నారని, కానీ ఎకరానికి 12 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. తెలంగాణలో రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, గత రెండున్నరేళ్లలోనే వ్యవసాయ రంగానికి రూ. 1,67,877 కోట్ల ఖర్చు చేశామని తెలిపారు. జగన్నాధపురం వడ్డేపల్లి క్రాస్ రోడ్డులో లక్షలాది మంది రైతుల సమక్షంలో 9 నుండి 54 ఎకరాల భూమి ఉన్న 16 లక్షల 81 వేల మంది రైతుల ఖాతాల్లో ఈరోజు ముఖ్యమంత్రి రూ. 1009 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే 8 వేల ఎకరాలకు పైగా రైతులకు ఈ ప్రయోజనం చేకూరగా, ఈరోజు విడుదల చేసే నిధులతో 54 ఎకరాల భూమి ఉన్న రైతులందరికీ లబ్ధి జరుగుతుందని వివరించారు.

## అయోధ్య కేసుపై జూలై 13న సుప్రీంలో విచారణ



**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**
అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జూలై 7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14 రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లను పరిశీలించనున్నది. అయోధ్య ఘటనలో సీబీఐ దర్యాప్తు చేపట్టాలని నరేంద్ర కుమార్ గోస్వామి అనే పిటీషనర్ సుప్రీంను ఆశ్రయించారు. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు చెందిన కాగ్ ఆడిట్ వివరాలను వెల్లడించాలని కోరారు. ఇదే కేసులో అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ కూడా పిటీషన్లు వేశారు.

## పూరి రథయాత్ర.. డ్రోన్లపై నిషేధం



**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**
జన్నాథుడి రథయాత్ర కోసం పూరిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై 16వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రథయాత్ర జరగనున్నది. అయితే ఆ సమయంలో డ్రోన్లపై నిషేధం విధించారు. అయిదు కిలోమీటర్ల పరిధి వరకు నో ఫ్లయింగ్ జోన్ ప్రకటించారు. రథయాత్రను నిర్విఘ్నంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. అయితే అనుమతి ఉన్న ఏజెన్సీలు తమ డ్రోన్లను ఆపరేట్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఏరియల్ సర్వే, సెక్యూర్టీ ఆపరేషన్స్, ఏరియల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మ్యాపింగ్, డాక్యుమెంటేషన్, డిజాస్టర్ రెస్పాన్స్ కోసం డ్రోన్లను వినియోగించనున్నారు. దీనికి జిల్లా యంత్రాంగం అనుమతి అవసరం ఉంటుంది.

## భారత్‌కు తరలిస్తున్న 22 కేజీల కొకైన్ అమెరికాలో సీజ్



**న్యూఢిల్లీ,(జర్నలిస్టు డైరీ) జూలై 10**
భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్ ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు. ఆపరేషన్ స్ట్రయికర్ పేరుతో సీబీపీ ఆపరేషన్ చేపట్టారు. స్పీకర్లు, ఆంప్లిఫయర్లలో 8 ప్యాకెట్లు, నాలుగు బ్రిక్స్ రూపంలో వైట్ పౌడర్‌ను దాచిపెట్టినట్లు సీబీపీ అధికారులు తెలిపారు. ఆ పౌడర్‌ను కొకైన్ హైడ్రోక్లోరైడ్‌గా గుర్తిస్తూ అధికారులు నిర్ధారణ చేశారు. 22 కేజీలు ఉన్న ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లుగా ఉంటుందని కస్టమ్స్ అధికారులు చెప్పారు.

## 12% మించి ఆల్కహాల్ ఉంటే ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి

**దగ్గు సిరప్‌ల అమ్మకాలపై కేంద్రం కొత్త నిబంధనలు**

**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**



దగ్గు మందులు, టానిక్‌లు, ఇతర ఔషధాల అమ్మకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలులోకి తెచ్చింది. 12 శాతం కన్నా ఎక్కువ ఆల్కహాల్ ఉండే ఔషధాలను బహిరంగంగా విక్రయించడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. అర్హులైన డాక్టర్ ఇచ్చే ప్రిస్క్రిప్షన్ లేకుండా ఈ మందులను ఇక అమ్మడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# స్పెయిన్‌లో హీట్‌వేవ్..

**కార్చిచ్చుకు 12 మంది బలి**

**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**
స్పెయిన్‌లో తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో దావానలం చెలరేగుతోంది. అండలూసియన్ ప్రాంతంలో సుమారు 12 మంది మృతిచెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. దాదాపు 150 మంది ఫైర్‌ఫైటర్లు మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. అల్మేరియాలోని లాస్ గల్లార్డోస్‌లో కార్చిచ్చు వ్యాపిస్తున్నది. దక్షిణ యూరోప్‌లో గత కొన్ని రోజుల నుంచి 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.



ఫ్రాన్స్, పోర్చుగల్, స్పెయిన్ దేశాల్లో ఎండ తీవ్రత వల్ల అడవులు అంటుకుంటున్నాయి. దీంతో ఫైర్‌ఫైటర్లు ఆ కార్చిచ్చును ఆపే ప్రయత్నంలో ఉన్నారు. వేల సంఖ్యలో జనం తమ ఇండ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్నారు.దావానలం వల్ల మృతిచెందిన బాధితుల మృతదేహాలు కార్లలోనే ఉన్నాయి. రాత్రి పూట మంటలు వ్యాపించడంతో.. ఎటువెళ్లాలో తెలియని స్థితిలోకి ప్రజలు వెళ్లిపోయారు. మంటల వల్ల రోడ్లను మూసివేశారు. కార్చిచ్చును ఆపేందుకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ప్రధాని పెడ్రో సాంచేజ్ తెలిపారు. స్పెయిన్ మిలిటరీ ఎమర్జెన్సీ యూనిట్.. లాస్ గల్లార్డోస్‌కు అగ్నిజ్వాలల్ని ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నది. 1950 తర్వాత స్పెయిన్‌లో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. గత ఏడాది రికార్డు స్థాయిలో సుమారు 10 లక్షల ఎకరాల అడవి అంటుకున్నది. గత 20 ఏళ్లలో పోలిస్తే ఇది ఆరు రెట్లు ఎక్కువగా తేలింది.

## భారీ వర్షాలకు..శ్మశానవాటిక నుంచి కొట్టుకుపోయిన మృతదేహాలు

**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**
భారీగా కురుస్తున్న వర్షాల వల్ల పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో శ్మశానవాటికలోని సమాధుల నుంచి మృతదేహాలు కొట్టుకుపోయాయి. గమనించిన స్థానికులు పోలీసుల సహాయంతో ఆ మృతదేహాలను వెలికితీశారు. మతపరమైన లాంఛనాలతో తిరిగి ఖననం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.కాగా, సహారన్‌పూర్ జిల్లాలోని రహదారి పక్కన ఉన్న శ్మశానవాటికను వరద నీరు ముంచెత్తింది. దీంతో నీటి ప్రవాహానికి పలు సమాధులపై ఉన్న మట్టి కోతకు గురైంది. ఈ నేపథ్యంలో ఖననం చేసిన పలు మృతదేహాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మరోవైపు ఇది



తెలుసుకుని గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు కూడా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కొట్టుకుపోయిన మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. పోలీసులు, సంఘ సభ్యుల సమక్షంలో శ్మశానవాటికలోని సురక్షితమైన, ఎత్తైన ప్రదేశంలో మతపరమైన లాంఛనాలతో గౌరవప్రదంగా తిరిగి ఖననం చేశారు. అయితే భూ ఆక్రమణల వల్ల వర్షం నీరు, నదీ ప్రవాహం వెళ్లే సహజ కాలువలు అడ్డుపడ్డాయని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో భారీ వర్షాల సమయంలో గ్రామాలతో పాటు శ్మశానవాటికలు మునగడంతో ఇలాంటివి జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికను రక్షించడానికి నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాలని, హిండన్ నది, సమీపంలోని కాలువలను వెడల్పు చేసే శాశ్వత చర్యలు అమలు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

## సుప్రీంకోర్టులో అనూహ్య పరిణామం

**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**



సుప్రీంకోర్టులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నేడు విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరపున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డులో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పిటిషనర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు.

## బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్ ధర 1.34 లక్షలు




**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**
మొబైల్ టవర్ సిగ్నల్ లేని చోట కూడా ఫోన్ కాల్స్ చేసుకునే అవకాశం కల్పిస్తూ బీఎస్ఎన్ఎల్ సరికొత్త శాటిలైట్ ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అడవులు, సముద్ర ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, విపత్తులు సంభవించిన చోట ఈ ఫోన్‌తో మాట్లాడొచ్చు. దీని ధర రూ.1,34,166. దీనిని సొంతం చేసుకోవాలంటే ముందుగా కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.అనుమతి లేకుండా దీనిని వాడటం చట్టపరమైన సమస్యలను తెచ్చిపెడుతుంది. ఈ ఫోన్ నేరుగా ఉపగ్రహాలతో అనుసంధానం అవుతుంది. దీంతో సెల్యులార్ నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లోనూ వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. రక్షణ శాఖ, సముద్ర రవాణా, విపత్తు నిర్వహణ బృందాలు, గనుల పరిశ్రమ, మారుమూల ప్రాంతాల్లో పనిచేసే సంస్థలు, సాహస యాత్రికులు..మొదలైనవారిని దృష్టిలో పెట్టుకొని శాటిలైట్ ఫోన్‌ను రూపొందించారు.

## వైద్య విద్యార్థిని హత్య వెనక మతమార్పిడి కుట్ర..

**-కేరళలో ఎఫ్ఐఆర్ నమోదు..!**

**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**
వారం క్రితం ఉబ్బెకిస్థాన్‌లో హత్యకు గురైన 22 ఏళ్ల కేరళ వైద్య విద్యార్థిని సావారియా బసంత్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తమబిడ్డను అన్యాయంగా పొట్టనబెట్టుకున్నారంటూ పోలీసులను ఆశ్రయించారు కుటుంబసభ్యులు. మతమార్పిడికి బలవంతం చేసి, చిత్రహింసకు గురి చేసి తమ కూతురిని హత్య చేశారని వారు ఫిర్యాదు చేశారు.వైద్య విద్యార్థిని సావారియా బసంత్ హత్యపై హత్యపై సమగ్ర విచారణ కోరుతున్న ఆమె కుటుంబసభ్యులు బుధవారం జిల్లా ఎస్పీ, అధికారులను కలిశారు. స్థానిక హరిపడ్ పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేయగా మర్డర్ కేసు నమోదైంది. కేసు విచారణను వేగవంతం చేయాలని కేరళ పోలీసులను కోరిన కుటుంబీకులు.. హంతకుడిని భారత్‌కు రప్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసుపై కాయంకులం డీప్యూటీ



సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిను కుమార్ స్పందించారు. విదేశంలో వైద్య విద్యార్థిని చనిపోయినప్పటికీ తాము కేసు ఫైల్ చేశామని చెప్పారు.
ఉజ్బెకిస్థాన్‌లో హత్య జరిగినప్పటికీ.. నిబంధనల ప్రకారం మేము కేసు నమోదు చేశాం. అక్కడి పోలీసులు దోషికి శిక్ష వేస్తేమేము ఇక్కడ కేసును మూసేస్తాం. కానీ, ఉజ్బెకిస్థాన్‌లో ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే మేము ఈ కేసును ఛేదించేందుకు సిద్ధంగా ఉన్నాం అని వెల్లడించారు.
అంతేకాదు ఈ కేసు విచారణ గురించి తెలుసుకునేందుకు ఉజ్బెకిస్థాన్‌లోని భారత రాయబారి కార్యాలయం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటామ'ని పీటీఐతో ఆయన తెలిపారు. అలప్పుజా వైద్య కళాశాలలో సవారియా బసంత్ మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించామని ఒక పోలీసు అధికారి తెలిపారు.

**ల్యాప్‌టాప్‌తో కొట్టి..**

ఉజ్బెకిస్థాన్‌లో వైద్య విద్యనభ్యసిస్తున్న సావారియా బసంత్‌ను ఆమెతో పాటే చదువుకుంటున్న విద్యార్థి సదరుల్ అనమ్ దారుణంగా హత్య చేశాడు. నిందితుడు అనమ్ ల్యాప్‌టాప్‌తో ఆమె తలపై కొట్టి చంపేశాడు. అయితే.. ఈ హత్యకు మతమార్పిడి కోణం ఉందని సవారియా కుటుంబం ఆరోపిస్తోంది. తమ కూతురి మృతదేహంపై పలు చోట్ల గాయాలు ఉన్నాయని, మతమార్పిడికి పాల్పడాలని ఒత్తిడి చేసి.. తమ బిడ్డను చిత్రహింసకు గురి చేసి చంపారని వారు కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఈ20తో మైలేజ్ తగ్గొచ్చు

**-అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం**
**-సంప్రదాయ ఇంధనం కన్నా దీని ధర కాస్త ఎక్కువే**
**-విస్తృతంగా పరిశీలించాకే ఇథనాల్ పెట్రోల్ ప్రవేశపెట్టాం**
**-విమర్శల నేపథ్యంలో వివరణ**

**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 10**
పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి ఈ20 పేరుతో అమ్ముతున్న ఇథనాల్ మిశ్రమ ఇంధనంపై దేశవ్యాప్తంగా వాహనదారుల నుంచి ప్రతిఘటన




ఎదురవుతున్నది. ఇప్పటికే దీనిపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వాహనదారుల ఆధ్వర్యంలో ధర్నా కూడా జరిగింది.ఈ సందర్భంగా దేశంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు కేంద్రం సమాధానమిచ్చింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# భారత్-ఇండోనేషియా సంబంధాలు: ఒక విమర్శనాత్మక పరిశీలన

భారత్--ఇండోనేషియా సంబంధాలు కేవలం రెండు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక అనుబంధం మాత్రమే కాదు. ఆసియా--పసిఫిక్ ప్రాంత భవిష్యత్తును ప్రభావితం చేసే వ్యూహాత్మక భాగస్వామ్యంగా కూడా అవి మారాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ప్రజాస్వామ్య దేశం భారత్ కాగా, అత్యధిక ముస్లిం జనాభా కలిగిన ప్రజాస్వామ్య దేశం ఇండోనేషియా. వేల ఏళ్లుగా వాణిజ్యం, బౌద్ధం, హిందూ సంస్కృతి, సముద్ర మార్గాల ద్వారా ఈ రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాలు ఏర్పడ్డాయి. నేటి కాలంలో ఆ బంధాలు ఆర్థిక, భద్రతా, సముద్ర, ఇంధన, డిజిటల్ రంగాలకు విస్తరించినప్పటికీ, వాటి పూర్తి సామర్థ్యం ఇంకా ఆచరణలోకి రాలేదనే విమర్శ బలంగా వినిపిస్తోంది.ఇటీవలి కాలంలో రెండు దేశాల నాయకుల పరస్పర పర్యటనలు, రక్షణ సహకార ఒప్పందాలు, సముద్ర భద్రతపై సంయుక్త చర్చలు, ఇండో-పసిఫిక్ వ్యూహంపై సమన్వయం వంటి అంశాలు సంబంధాలను మరింత బలోపేతం చేశాయి. అయినప్పటికీ, రాజకీయ ప్రకటనలు ఎంత బలంగా ఉన్నాయో, ఆర్థిక ఫలితాలు అంతగా కనిపించడం లేదు. ప్రపంచ వేదికలపై పరస్పర మద్దతు ప్రకటించడం ఒక విషయం అయితే, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యం, ప్రజల మధ్య ప్రత్యక్ష అనుసంధానం వంటి రంగాల్లో పురోగతి సాధించడం మరో విషయం.



భారత్ “యాక్ట్ ఈస్ట్” విధానాన్ని అమలు చేస్తుండగా, ఇండోనేషియా తన “గ్లోబల్ మెరిటైమ్ ఫుల్క్రమ్” దృష్టికోణాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఈ రెండు విధానాల మధ్య సహజమైన అనుసంధానం ఉంది. ముఖ్యంగా హిందూ మహాసముద్రం, మలక్కా జలసంధి, అండమాన్ సముద్ర ప్రాంతాలు ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన సముద్ర మార్గాలు. ఈ నేపథ్యంలో సముద్ర భద్రత, నౌకాదళ విన్యాసాలు, అక్రమ రవాణా నిరోధం, సముద్ర దోపిడీ నియంత్రణ, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో సహకారం పెరగడం సానుకూల పరిణామమే. అయితే ఈ సహకారం ఇప్పటికీ పరిమిత స్థాయిలోనే ఉందని చెప్పాలి. సంయుక్త కార్యాచరణ కంటే ప్రకటనలే ఎక్కువగా కనిపిస్తున్నాయన్న విమర్శకు కొంత వాస్తవం ఉంది.ఆర్థిక రంగంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతున్నప్పటికీ, రెండు దేశాల ఆర్థిక పరిమాణంతో పోలిస్తే అది ఇంకా చాలా తక్కువ. భారత్ ఇండోనేషియా నుంచి ప్రధానంగా బొగ్గు, పామాయిల్, ఖనిజాలను దిగుమతి చేసుకుంటుండగా, ఔషధాలు, ఆటోమొబైల్ ఉత్పత్తులు, ఉక్కు, రసాయనాలు, వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ వాణిజ్యంలో విలువ ఆధారిత ఉత్పత్తుల కంటే ముడి పదార్థాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉండటం ఒక బలహీనత. ఉమ్మడి తయారీ పరిశ్రమలు, సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, కృత్రిమ మేధస్సు వంటి భవిష్యత్ రంగాల్లో భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు.ఇండోనేషియాలో నికెల్ వంటి కీలక ఖనిజ సంపద విస్తారంగా ఉంది. విద్యుత్ వాహనాల బ్యాటరీల తయారీకి ఇవి అత్యంత అవసరం. భారత్ తన హరిత ఇంధన లక్ష్యాలను సాధించాలంటే ఇండోనేషియాతో దీర్ఘకాలిక ఖనిజ భాగస్వామ్యం అత్యంత ప్రాధాన్యమైనది. కానీ ఈ అవకాశాన్ని చైనా ఇప్పటికే విస్తృత పెట్టుబడులతో వినియోగించుకుంది. ఇండోనేషియాలో మౌలిక వసతులు, గనులు, పరిశ్రమలలో చైనా ప్రభావం గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో భారత్ పోటీ చేయాలంటే వేగవంతమైన నిర్ణయాలు, పెట్టుబడి విధానాల్లో స్పష్టత, ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.రక్షణ రంగంలో రెండు దేశాల మధ్య సహకారం పెరుగుతున్నా, అది ఇంకా ప్రారంభ దశలోనే ఉందని చెప్పాలి. సముద్ర భద్రతపై ఇరు దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఆధునిక రక్షణ సాంకేతికత, ఆయుధ ఉత్పత్తి, ఇంటెలిజెన్స్ పంచుకోవడం, సైబర్ భద్రత వంటి రంగాల్లో మరింత లోతైన భాగస్వామ్యం అవసరం. కేవలం సైనిక విన్యాసాలు నిర్వహించడం మాత్రమే వ్యూహాత్మక భాగస్వామ్యానికి సరిపోదు. స్థిరమైన సంస్థాగత సహకార వ్యవస్థను కూడా నిర్మించాలి. సాంస్కృతికంగా చూస్తే, రామాయణం, మహాభారతం, బాలి ద్వీపంలోని హిందూ సంప్రదాయాలు, బోరోబుదూర్ వంటి బౌద్ధ వారసత్వ కట్టడాలు భారత్--ఇండోనేషియా అనుబంధానికి చారిత్రక గుర్తులు. అయినప్పటికీ ఈ వారసత్వాన్ని ఆధునిక సాఫ్ట్ పవర్‌గా మలచడంలో రెండు దేశాలు పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు. విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త విశ్వవిద్యాలయ పరిశోధనలు, పర్యాటక ప్రోత్సాహం, భాషా అధ్యయన కేంద్రాలు, సినీ--సాంస్కృతిక సహకారం ఇంకా విస్తరించాల్సి ఉంది. ప్రజల మధ్య సంబంధాలు బలపడితేనే ప్రభుత్వాల మధ్య ఒప్పందాలకు శాశ్వత బలం లభిస్తుంది.

ఇంకొక ముఖ్యమైన అంశం ప్రాంతీయ దౌత్యం. ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య (ఆసియాన్)లో ఇండోనేషియా ప్రభావశీల దేశం. భారత్‌కు ఆసియాన్‌తో సంబంధాలు మరింత బలోపేతం కావాలంటే ఇండోనేషియా కీలక భాగస్వామిగా ఉంటుంది. అదే సమయంలో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా--చైనా వ్యూహాత్మక పోటీ వేగంగా పెరుగుతోంది. ఈ పోటీలో భారత్, ఇండోనేషియా రెండూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే చైనా ఆర్థిక ప్రభావం ఇండోనేషియాపై అధికంగా ఉండటం వల్ల ప్రతి అంశంలో భారత ప్రయోజనాలకు జకార్తా బహిరంగంగా మద్దతు ఇస్తుందని ఆశించడం వాస్తవిక దృక్పథం కాదు. అంతర్జాతీయ సంబంధాల్లో శాశ్వత మిత్రులు కంటే శాశ్వత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందనే సత్యాన్ని భారత్ ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి.


ఈ సంబంధాలపై విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, రెండు దేశాలు అవకాశాలను గుర్తిస్తున్నప్పటికీ, వాటిని కార్యరూపంలోకి తీసుకురావడంలో నెమ్మదిగా వ్యవహరిస్తున్నాయి. అనేక అవగాహన ఒప్పందాలు కాగితాలకే పరిమితమవుతున్నాయనే అభిప్రాయం వ్యాపార వర్గాల్లో ఉంది. నిర్ణయాల అమలులో జాప్యం, అధికార యంత్రాంగంలోని సంక్లిష్టత, పెట్టుబడి అడ్డంకులు, సరైన రవాణా అనుసంధానం లేకపోవడం వంటి అంశాలు సహకారాన్ని పరిమితం చేస్తున్నాయి. కేవలం ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించడం ద్వారా సంబంధాలు బలపడవు; నిరంతర అమలు యంత్రాంగం, కొలిచే లక్ష్యాలు, సమయపాలన కూడా అంతే అవసరం.

ప్రస్తుత ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాలను దృష్టిలో ఉంచుకుంటే భారత్--ఇండోనేషియా సంబంధాలు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశముంది. సరఫరా గొలుసుల పునర్వ్యవస్థీకరణ, హరిత ఇంధన మార్పు, సముద్ర భద్రత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఉగ్రవాద నిరోధం, వాతావరణ మార్పు వంటి అనేక రంగాల్లో ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఈ అవకాశాలను వాస్తవ ఫలితాలుగా మార్చాలంటే దౌత్య ప్రకటనల కంటే కార్యాచరణకు, సంకల్పాల కంటే అమలుకు, భావోద్వేగ చారిత్రక అనుబంధాల కంటే పరస్పర ఆర్థిక ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే భారత్--ఇండోనేషియా సంబంధాలు ఆసియాలో స్థిరత్వానికి, ప్రాంతీయ అభివృద్ధికి, సమతుల్య అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణానికి నిజమైన వ్యూహాత్మక భాగస్వామ్యంగా నిలుస్తాయి.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

# రూ.47.03 కోట్లతో కోహెడలో ఆధునిక చేపల ఎగుమతి మార్కెట్‌కు శంకుస్థాపన

**- మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ -**
**- మంత్రి వాకిటి శ్రీహరి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో , జూలై 10 (జర్నలిస్ట్ డైరీ) :**
రాష్ట్రంలోని మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వాలనే లక్ష్యంతో కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత ఇంటిగ్రేటెడ్ హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఁ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని మత్స్యకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ముదిరాజ్, బెస్త తదితర మత్స్యకార వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.దేశంలోనే సముద్రతీర ప్రాంతం కాకుండా అంతర్గత రాష్ట్రంలో ఏర్పాటవుతున్న తొలి ఆధునిక మంచినీటి చేపల ఎగుమతి కేంద్రంగా ఈ ప్రాజెక్టు నిలవనుందని మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉందని, ఈ మార్కెట్ ద్వారా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు విస్తృత అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు.మార్కెట్‌లో ఆధునిక శీతల గిడ్డంగులు, చేపల శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సుమారు రెండు వేల మంది వ్యాపారులు వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా, ఐదు వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుందని వివరించారు.భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఈ మార్కెట్ తెలంగాణ మత్స్యకారుల అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. బ్లూ రివల్యూషన్ లక్ష్యాలను సాధించడంలో ఇది కీలకంగా మారుతుందని, మత్స్యకారులకు గిట్టుబాటు ధరలు, ఆధునిక మార్కెటింగ్ సౌకర్యాలు, ఎగుమతి అవకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ...విజయవాడ జాతీయ రహదారి, నాగార్జునసాగర్ రహదారి, ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో చేపల మార్కెట్ నిర్మాణం చేపట్టడం వల్ల మత్స్యకారులు, ముదిరాజ్, బెస్త వర్గాలకు విశేష ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు వెల్లడిస్తూ, మరిన్ని ఆధునిక సౌకర్యాల కోసం అదనంగా రూ.50 కోట్లు మంజూరు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు.ఈ కార్యక్రమంలో ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అదనపు డైరెక్టర్ మురళీకృష్ణ, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, మత్స్యకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం తొలి బోనాల జాతరకు మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



**హైదరాబాద్, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ ):**
తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న తొలి బోనాల జాతర కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం పెద్దలు, తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం తొలి బోనాల జాతర కమిటీ చైర్మన్ ఆడాల గణేష్ ఆధ్వర్యంలో మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెలలో నిర్వహించనున్న తొలి బోనాల జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించి, ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి కొండా సురేఖ, కుమ్మర సంఘం నిర్వహిస్తున్న తొలి బోనాల జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ మున్సిపాలిటీ 26వ వార్డు లో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం విజయవంతం

**- 26వ వార్డు కౌన్సిలర్, శివ ఎస్.పి.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. వార్డు ప్రజలు పాల్గొని ఎస్.ఐ.ఆర్ ఫారమ్‌ల స్వీకరణ, పరిశీలన మరియు అవసరమైన వివరాల నమోదులో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శివ శివ ఎస్.పి. మాట్లాడుతూ..
ప్రజలకు ఎస్.ఐ.ఆ ర్ప్. ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, ఓటరు జాబితాలో కొత్త గా నమోదు, మార్పులు, సవరణలు మరియు ఇతర సేవలకు సంబంధించిన ఫారమ్‌లను అధికారులు స్వీకరించి అవసరమైన సూచనలు అందించారనీ. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన వివరాలు సక్రమంగా నమోదు చేసుకునేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారనీ. ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారనీ అన్నారు. ప్రజల సహకారమ ప్రజాస్వామ్యానికి బలం -- ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు...

**- పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ) :**
డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సందర్శించేందుకు వెళ్తున్న మహిళలను పోలీసులు అడ్డుకోవడాన్ని ప్రశ్నిస్తూ నిరసన తెలిపిన విష్ణువర్ధన్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి కొత్తూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ అరెస్ట్‌కు నిరసనగా, అలాగే సిద్ధాపూర్ ప్రజల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు ఈ రోజు నుంచి ఉద్యమం ముగిసేంత వరకు ప్రతిరోజూ రిలే నిరవధిక నిరాహార దీక్షతో పాటు శాంతియుత ప్రజా పోరాటాన్ని కొనసాగించాలని విష్ణువర్ధన్ రెడ్డి సంకల్పించారు.డంపింగ్ యార్డ్ రద్దు అయ్యే వరకు మా పోరాటం ఆగదు...శాంతియుతంగా... రాజ్యాంగబద్ధంగా... ప్రజల హక్కుల కోసం మా ఉద్యమం కొనసాగుతుంది.”సిద్ధాపూర్..డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి.అని ఆయన నినాదాలు చేశారు....

## సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె గోవర్ధన్‌కు ఘన సన్మానం



**సరూర్‌నగర్ (జులై10). జర్నలిస్ట్ డైరీ.**
సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె గోవర్ధన్‌ను ఆత్మీయుల గ్రూప్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గందె గోవర్ధన్ నాయకత్వంలో ఆర్యవైశ్య సంఘం సేవా కార్యక్రమాలు, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షిస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.సన్మానానికి స్పందించిన గందె గోవర్ధన్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమం లో సోమ సత్యనారాయన,ఉప్పు బాలస్వామి సోమ సత్యనారాయణ ఉడకచర్ల పాండయ్య, కటకం కేశవులు నీల వేణు ఆగిరు రఘునందన్ కూరా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## వివేకానంద నగర్ డివిజన్ లో జరిగిన ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ.




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ) :**
ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగ వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ లోని ఆరెకపూడి గాంధీ నివాసంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో డీసీ చాముండేశ్వరి తో కలిసి పాల్గొన్న పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ... ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే ప్రతి ఒక్కరు పాటించాలని , దోమల నివారణ మరియు పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుంది అని, ఇంట్లో నీటి నిల్వ ఉంచకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాల్లో నిలిచిన నీటి నిల్వలను ప్రత్యక్షంగా పరిశీలించి తొలగించడం జరిగినది. మీ ఇంట్లో పరిసరాల్లో నిలిచి ఉన్న నీటి నిల్వలను తొలగించి వ్యాధుల వ్యాప్తి రాకుండా చూడాలని , మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, కలరా లాంటి వ్యాధులకు కారణం అవుతున్న దోమల నివారణకు, అవి వృద్ధి చెందకుండా ఉండడానికి ప్రతి శుక్రవారం విధిగా మన ఇంట్లో, ఇంటి పరిసర ప్రాంతాల్లో నిలిచి ఉన్న నీరు ను ఖాళీ చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రజలు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, కలరా వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు చేపట్టాల్సిన చర్యల పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు తెలియచేశారు. కూలర్ ,ఫ్రిజ్, కుండలు, పాత టైర్లు, బకెట్ల లో నీటి నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో ఏంట మాలాజీ సిబ్బంది నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం ఆరుద్ర నక్షత్రం.. రుద్రాభిషేకం, బిల్వార్చనకు విశేష ప్రాధాన్యం...



**ఆమనగల్, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ):**
ఈ వచ్చే సోమవారం పవిత్రమైన ఆరుద్ర నక్షత్ర సంయోగం ఏర్పడనున్న నేపథ్యంలో ఆ రోజు పరమేశ్వరుని ఆరాధనలో భక్తులు నిమగ్నం కావాలని పండితులు సూచిస్తున్నారు. శివునికి అత్యంత ప్రీతికరమైన నక్షత్రంగా ఆరుద్రను భావిస్తారని, ఈ నక్షత్రానికి అధిదేవత రుద్రుడు (పరమశివుడు) కావడంతో ఆ రోజున నిర్వహించే శివపూజలకు విశేష ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.
ఆరుద్ర నక్షత్రం రోజున రుద్రాభిషేకం, బిల్వదళార్చన, పంచాక్షరీ మంత్ర జపం, శివనామస్మరణ, రుద్రపారాయణం చేయడం ద్వారా విశేష పుణ్యఫలం లభిస్తుందని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయని పండితులు వివరించారు.
అలాగే ఉపవాస దీక్షతో శివాలయాలను దర్శించి భక్తిశ్రద్ధలతో శివారాధన చేయడం శుభప్రదమని సూచించారు.
భక్తిపూర్వకంగా పరమేశ్వరుని ఆరాధించిన వారికి కుటుంబంలో సుఖశాంతులు, ఐకమత్యం, ఆనందం పెరిగి శివుని అనుగ్రహం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా ప్రజలందరికి బోనాల పర్వదిన శుభాకాంక్షలు

**-బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకుందాం**

**-బోనాల పండుగ ఉత్సవాల ఏర్పాట్ల నిధుల కోసం దరఖాస్తుల స్వీకరణ**

**-గౌరవ పియేసి చైర్మన్ ఆరెక పూడిగాంధీ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ) :**
తెలంగాణ రాష్ట్ర సంస్కృతి , సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరి చేసింది అని, బోనాల పండుగ ఉత్సవాల ఏర్పాట్ల నిధుల కోసం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆయా దేవాలయాల ఆలయ ధర్మకర్తలు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని,గాజ చైర్మన్ గాంధీ గారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవడానికి నిధులు మంజూరి చేయడం జరుగుతుంది అని అన్నారు.
ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి పెద్ద మనస్సు తో ఈ ఏడాది బోనాల ఉత్సవాల కోసం రూ.20 కోట్ల నిధులు మంజూరి చేయడం జరిగినది అని, ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లను సమన్వయంతో అమలు చేయడం జరుగుతుంది అని, మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. ప్రతి భక్తుడు అమ్మవారి ఆశీస్సులతో ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను జరుపుకునేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని తెలియచేశారు.
బోనాల పండుగ ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు నిధులు మంజూరు చేస్తోందని కావున అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అదేవిధంగా అర్హత (రిజిస్ట్రేషన్) కలిగిన ఆలయ కమిటీలకు నిధుల కోసం దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలియచేశారు.
దరఖాస్తుతో పాటు
1) టెంపుల్ కమిటీ లెటర్‌ప్యాడ్,
2) ఆలయ బ్యాంక్ ఖాతా వివరాలు,
3) ఆలయ కమిటీ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ ఆధార్ కార్డు ప్రతులు,
4) ఆలయానికి సంబంధించిన అమ్మవారి ఫొటోలు...
5) ప్రతీ కాపీ పై కమిటీ స్టాంపు ముద్రించి జతపరచాలని సూచించారు. దరఖాస్తుల చివరి తేదీ 15.7.2026 అని తెలిపారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం..

**- షాద్‌నగర్‌లో కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ) :**
రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించిన కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ షాద్‌నగర్ నియోజకవర్గంలో విజయవంతంగా జరిగింది. అఖిల భారత విద్యార్థి సమాఖ్య, భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమం నిర్వహించి విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత విద్యార్థి సమాఖ్య షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్, అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం. పవన్ చౌహాన్, భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రతిపాదనను విరమించుకోవాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు, అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వసతి, ఇతర నిర్వహణ చార్జీలను పెంచి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉత్తమ అందుబాటు పథకానికి నిధులు విడుదల చేయాలని, జాతీయ విద్యా విధానం--2020ను తెలంగాణలో అమలు చేయవద్దని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని కోరారు.
గత ఆరు సంవత్సరాలుగా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు భారీగా పెండింగ్‌లో ఉండటంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకుడు శివకుమార్, శ్రీను, సాయి, రాహుల్, రమేష్, ఉదయ్, భారత విద్యార్థి సమాఖ్య నాయకులు అదిల్, చరణ్, రామ్‌చరణ్, అవేజ్, సోహెల్, అబ్బు, రాజు, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## కదం కదం తొక్కుతూ.. ఐక్యమత్యంతో ముందుకు వెళ్తూ తండాల్లో కదిలిన ఉద్యమ దండు

**-పచ్చని పంట పొలాలు పండే పొలాల్లో చెత్తబుట్టలు వద్దు**

**-ప్రజల ప్రాణాల కంటే మాకు ఏది గొప్పది కాదు**

**-డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ.**

**-వై ఎం తాండ, పులిచెర్లకుంట తండాలలో భారీ ర్యాలీ.**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 10 (జర్నలిస్ట్ డైరీ) :**
పచ్చని పంట పొలాలు పండే పొలాల్లో చెత్తబుట్టలు వద్దు అని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ధ్వజమెత్తారు.సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆయన వైయం తండా,పులిచెర్లకుంట తండాలలో పర్యటించారు. మహిళలు యువకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి డంపింగ్ యార్డ్ వల్ల జరిగే అనర్థాలు, నష్టం గురించి వారికి వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని అందుకు ఊరు, వాడ, తాండాలు ఏకం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించమంటే డంపింగ్ యార్డ్ ను మా నెత్తిన గుదిబండగా మోపుతున్నారని వాపోయారు. రాజకీయాలు చేయడానికి మేము రాలేదని డంపింగ్ యార్డ్ వాళ్ళ జరిగే నష్టాలు మాత్రమే చెప్పేందుకు వచ్చామని అన్నారు.కాంగ్రెస్ నాయకులు డంపింగ్ యార్డ్ రాదు రానివ్వమని చెప్తున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు.జీవో నెంబర్ 641 ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే విడుదల చేసిందని చెప్పారు.మనమంతా మేల్కొని డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకించాల్సింది పోయి కనీసం వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న మాకు మద్దతు తెలుపకుండా ఇంట్లో కూర్చుని మాట్లాడుతున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వడ్డే బాలయ్య,వైయం తాండ మాజీ సర్పంచ్ అరుణ రమేష్ నాయక్, నరేందర్ రెడ్డి,ఎస్ బి పల్లి ఉప సర్పంచ్ సున్నాల గణేష్,బాబు రాజ్,శంకర్ నాయక్,రాందాస్ నాయక్,గోపాల్ నాయక్,బిచ్యా నాయక్,సంతోష్ నాయక్, భాస్కర్ నాయక్,జ్యోతి నాయక్, కుమ్మరిగూడెం పాండు,వడ్డే మల్లేష్,వడ్డే మహేష్, మన్నే లక్ష్మయ్య,జామకాయల

## తరచూ తలనొప్పితోపాటు ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..

- జాగ్రత్త, అది బ్రెయిన్ ట్యూమర్ కావచ్చు..



నేటి వేగవంతమైన జీవనశైలిలో తలనొప్పి, అలసట, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలను చాలామంది సాధారణ విషయాలుగానే భావించి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఒత్తిడి, మైగ్రేన్, వయసు ప్రభావం లేదా నిద్రలేమి కారణంగానే ఇవి వస్తున్నాయని అనుకుని నొప్పి నివారణ ట్యాబ్లెట్లనను వేసుకుని సరిపెట్టుకుంటున్నారు. అయితే ఇలాంటి లక్షణాలు కొన్ని సందర్భాల్లో మెదడు కణితి (బ్రెయిన్ ట్యూమర్) వంటి తీవ్రమైన వ్యాధికి తొలి సంకేతాలు అయ్యే అవకాశాలు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెదడు కణితుల చికిత్సలో ప్రస్తుతం ఎన్నో ఆధునిక సాంకేతికతలు అందుబాటులో ఉన్నప్పటికీ, చాలా మంది రోగులు సరైన సమయంలో వైద్యులను సంప్రదించకపోవడం వల్లే చికిత్స ఆలస్యమవుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రారంభ దశలో కనిపించే లక్షణాలు సాధారణ ఆరోగ్య సమస్యలను పోలి ఉండటంతో, చాలామంది నెలల తరబడి వాటిని నిర్లక్ష్యం చేస్తుంటారు.

**ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..**

తలనొప్పి, తరచూ వాంతులు కావడం, చూపు మసకబారడం లేదా తగ్గిపోవడం, కారణం లేకుండా ఫిట్స్ రావడం, జ్ఞాపకశక్తి బలహీనపడటం, వ్యక్తిత్వంలో మార్పులు, నడిచేటప్పుడు సమతుల్యత కోల్పోవడం, చేతులు లేదా కాళ్లలో బలహీనత వంటి లక్షణాలు కనిపించినప్పుడు వాటిని సాధారణ సమస్యలుగా తీసుకోవద్దని సూచిస్తున్నారు. చాలామంది తలనొప్పిని ఉద్యోగ ఒత్తిడికి, జ్ఞాపకశక్తి తగ్గడాన్ని వయసు ప్రభావానికి, నడకలో తడబాటును అలసటకు ఆపాదిస్తూ ఉంటారు. ఈ విధంగా లక్షణాలకు తామే కారణాలు వెతుక్కోవడం వల్ల అసలు వ్యాధి గుర్తించడంలో ఆలస్యం జరుగుతుంది. చివరకు స్కానింగ్ పరీక్షలు చేయించే సమయానికి వ్యాధి మరింత ముదిరే అవకాశం ఉంటుంది. మెదడు కణితి అంటే ప్రాణాపాయం తప్పదనే అపోహ కూడా చాలా మందిలో ఉంటుంది. ఈ భయం వల్లే కొందరు పరీక్షలు చేయించుకోవడానికి వెనుకాడుతుంటారు. అయితే అన్ని బ్రెయిన్ ట్యూమర్లు క్యాన్సర్ కావని, చాలావరకు అవి నిరపాయమైనవే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్‌గా నిర్ధారణ అయిన సందర్భాల్లో కూడా కణితి రకం, అది ఉన్న ప్రాంతం, ఎంత త్వరగా గుర్తించారనే అంశాలపై చికిత్స ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

**ప్రారంభ దశలో గుర్తిస్తే..**

వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్సకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి. శస్త్రచికిత్సను మరింత సురక్షితంగా, కచ్చితంగా నిర్వహించేందుకు ప్రస్తుతం న్యూరోనావిగేషన్, ఇన్‌ట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ, అవేక్ క్రానియోటమీ, మినిమల్లీ ఇన్వాసివ్ ఎండోస్కోపిక్ విధానాలు వంటి అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయి. అలాగే కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో శస్త్రచికిత్సకు ముందే చికిత్స ప్రణాళికను మరింత సమర్థవంతంగా రూపొందించే అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. అయితే ఎంత ఆధునిక సాంకేతికత ఉన్నా, రోగి సరైన సమయంలో వైద్యులను సంప్రదించినప్పుడే వాటి ప్రయోజనం పూర్తిగా లభిస్తుంది. అందుకే తలనొప్పి లేదా ఇతర నరాల సంబంధిత లక్షణాలు పదేపదే వస్తున్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజల్లో అవగాహన పెరగడం, లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల మెదడు కణితుల చికిత్సలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

## యాపిల్ మన ఆరోగ్యానికి నిజంగానే మేలు చేస్తుందా..

### వైద్య నిపుణులు ఏమంటున్నారు..?


రోజూ ఒక యాపిల్ తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందనే మాట చాలాకాలంగా వినిపిస్తోంది. ఈ సామెతకు శాస్త్రీయ ఆధారాలు కూడా కొంతవరకు ఉన్నాయని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. యాపిల్‌లో విటమిన్లు, ఖనిజాలు, పీచు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. సమతుల ఆహారంలో భాగంగా యాపిల్‌ను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ నుంచి గుండె ఆరోగ్యం వరకు పలు ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. యాపిల్‌లో విటమిన్ సి, విటమిన్ కె, విటమిన్ బి6, రైబోఫ్లావిన్ వంటి విటమిన్లతోపాటు కాపర్, మెగ్నీషియం, పొటాషియం, మాంగనీస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే ఇందులో ఉండే పీచు పదార్థం రోజువారీ ఫైబర్ అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది.

**జీర్ణసమస్యలకు, బరువు తగ్గేందుకు..**

యాపిల్‌లోని పీచు జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది పేగుల కదలికలను సక్రమంగా ఉంచి మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేందుకు కూడా తోడ్పడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా యాపిల్ మంచి ఎంపికగా నిలుస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగించి ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. దీంతో అతిగా తినే అలవాటు తగ్గే అవకాశం ఉంటుంది. మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో యాపిల్‌లోని పాలీఫెనాల్స్ కొంతవరకు సహాయపడతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి కార్బోహైడ్రేట్ల శోషణ వేగాన్ని తగ్గించడంలో, ఇన్సులిన్ పనితీరుకు మద్దతు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. అయితే మధుమేహం ఉన్నవారు యాపిల్‌ను కూడా పరిమిత మోతాదులో, వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సూచనల మేరకు తీసుకోవడం మంచిది.

**రక్తహీనత, గుండె ఆరోగ్యానికి..**

రక్తహీనతతో బాధపడేవారికి కూడా యాపిల్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే ఐరన్ ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన




పోషకాలలో ఒకటి. అయితే తీవ్రమైన రక్తహీనతను కేవలం యాపిల్‌తోనే నివారించడం సాధ్యం కాదు. ఇతర ఐరన్ అధికంగా ఉండే ఆహారాలతోపాటు అవసరమైతే వైద్య చికిత్స కూడా తీసుకోవాలి. యాపిల్ గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, క్వెర్సెటిన్ వంటి ఫ్లేవనాయిడ్లు శరీరంలో వాపును తగ్గించడంలో, చెడు కొలెస్ట్రాల్ ఆక్సీకరణను నిరోధించడంలో సహాయపడుతుంది. దీంతో గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది. యాపిల్ పేగుల్లో ఉండే మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు తోడ్పడుతుంది. దీంతో జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడటంతోపాటు శరీర జీవక్రియలు కూడా సక్రమంగా సాగేందుకు సహాయపడుతుంది. హానికరమైన పదార్థాలను శరీరం నుంచి బయటకు పంపడంలో కూడా ఇది దోహదపడుతుంది. తరచూ నీరసంగా అనిపించే వారికి యాపిల్ శక్తినిచ్చే పండ్లలో ఒకటిగా పరిగణిస్తారు. ఇందులోని పోషకాలు శరీరానికి శక్తిని అందించడంలో, కండరాల బలహీనతను తగ్గించడంలో కొంతవరకు సహాయపడతాయి. అనారోగ్యం నుంచి కోలుకుంటున్నవారికి కూడా దీనిని సాధారణంగా ఆహారంలో చేర్చుతుంటారు.

**కంటి ఆరోగ్యానికి, చర్మానికి..**

యాపిల్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి వయస్సు పెరుగుతున్న కొద్దీ వచ్చే కొన్ని కంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. చర్మ ఆరోగ్యానికి కూడా యాపిల్ ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను రక్షించి ముడతలు, వృద్ధాప్య లక్షణాలు త్వరగా కనిపించకుండా చేయడంలో కొంతవరకు దోహదపడతాయి. అలాగే చర్మ కాంతిని కాపాడటానికి కూడా సహాయపడుతుంది. యాపిల్‌ను నమిలి తినడం వల్ల దంతాలు, చిగుళ్లు కొంతవరకు శుభ్రంగా ఉండేందుకు సహాయపడుతుంది. ఇందులోని ఫైబర్ నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించడంలో కొంత ప్రయోజనం చేకూర్చుతుంది. అయితే ఇది దంతాలను బ్రష్ చేయడానికి ప్రత్యామ్నాయం కాదు. రోజూ రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవడం, దంత వైద్యుడిని క్రమం తప్పకుండా సంప్రదించడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

## చుండ్రు అసలు ఎందుకు వస్తుంది..

-ఈ ఒక్క పదార్థంతో సమస్యకు చెక్ పెట్టవచ్చు..



చుండ్రు చాలా మందిని ఇబ్బంది పెట్టే సాధారణ తల చర్మ సమస్య. తలలో దురద, తెల్లని పొరలు రాలిపోవడం, జుట్టు నిర్జీవంగా కనిపించడం వంటి లక్షణాలు దీనివల్ల కనిపిస్తాయి. చుండ్రుకు ప్రధాన కారణాల్లో ఒకటి మలాసెజియా అనే ఫంగస్ అధికంగా పెరగడం. ఈ సమస్యను తగ్గించడంలో నిమ్మకాయను సహజసిద్ధమైన గృహచికిత్సగా చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు. నిమ్మలో ఉండే సిట్రిక్ యాసిడ్, యాంటీ మైక్రోబియల్ గుణాలు తల చర్మాన్ని శుభ్రపరచడంతోపాటు ఫంగస్ పెరుగుదలను నియంత్రించడంలో సహాయపడతాయి. నిమ్మరసంతోపాటు ఉసిరికాయ రసం కలిపి ఉపయోగించడం చుండ్రు తగ్గించడంలో ఉపయోగకరంగా ఉంటుంది. రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసానికి రెండు టేబుల్ స్పూన్ల ఉసిరికాయ రసం కలిపి కాటన్ సహాయంతో తల చర్మానికి పట్టించాలి. సుమారు 30 నిమిషాల తర్వాత నీటితో శుభ్రంగా కడిగేయాలి. ఈ మిశ్రమం తల చర్మంలోని మృతకణాలను తగ్గించడంతోపాటు జుట్టు కుదుళ్లకు పోషణనిచ్చి సహజమైన మెరుపును అందించడంలో సహాయపడుతుంది.

**పెరుగు లేదా తేనె..**


పెరుగుతో నిమ్మరసం కలిపి వాడటం కూడా చుండ్రును తగ్గించేందుకు మంచి మార్గంగా చెప్పవచ్చు. రెండు టేబుల్ స్పూన్ల పెరుగులో ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం కలిపి తల చర్మానికి పట్టించి 30 నిమిషాల తర్వాత మృదువైన షాంపూతో తలస్నానం చేయాలి. పెరుగులోని సహజ ఎంజైములు, నిమ్మలోని ఆమ్ల గుణాలు కలిసి చుండ్రును తగ్గించడంతోపాటు జుట్టును మృదువుగా ఉంచడంలో సహాయపడతాయి. నిమ్మరసం, తేనె కలయిక కూడా తల చర్మానికి మేలు చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసంలో మూడు టేబుల్ స్పూన్ల తేనె కలిపి తలకు పట్టించి 20 నిమిషాల తర్వాత మైల్డ్ షాంపూతో కడగాలి. తేనెలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఫంగస్ పెరుగుదలను నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే తల చర్మాన్ని తేమగా ఉంచి పొడిబారడం, దురద వంటి సమస్యలను తగ్గిస్తాయి. మంచి ఫలితాల కోసం మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి ఉపయోగించవచ్చు.

**గుడ్డు లేదా టీ డికాక్షన్..**

గుడ్డు, నిమ్మరసం మిశ్రమం కూడా జుట్టు సంరక్షణలో ఉపయోగపడుతుంది. ఒక గుడ్డును బాగా గిలక్కొట్టి అందులో ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని తల చర్మానికి పట్టించి 30 నిమిషాల తర్వాత మైల్డ్ షాంపూతో కడగాలి. గుడ్డు సహజ కండిషనర్‌గా పనిచేయడంతోపాటు మృతకణాలను తొలగించి జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. టీ డికాక్షన్‌తో నిమ్మరసం కలిపి ఉపయోగించడం కూడా చుండ్రును తగ్గించడంలో ఉపకరిస్తుంది. రెండు టీ స్పూన్ల టీ పొడిని అర కప్పు వేడి నీటిలో మరిగించి వడకట్టాలి. చల్లారిన తర్వాత అందులో ఒక టీ స్పూన్ నిమ్మరసం కలిపి తల చర్మానికి పట్టించాలి. సుమారు 20 నిమిషాల తర్వాత నీటితో శుభ్రంగా కడిగేయాలి. టీలోని యాంటీ ఆక్సిడెంట్లు, నిమ్మలోని యాంటీ మైక్రోబియల్ గుణాలు కలిసి తల చర్మాన్ని తాజాగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే నిమ్మరసం నేరుగా తలకు ఉపయోగించే ముందు చిన్న భాగంలో పరీక్షించడం మంచిది. తల చర్మంపై గాయాలు, ఇన్‌ఫెక్షన్లు లేదా తీవ్రమైన దురద ఉంటే ఈ చిట్కాలను ఉపయోగించే ముందు చర్మవ్యాధి నిపుణులను సంప్రదించడం అవసరం. చుండ్రు ఎక్కువకాలం కొనసాగినా లేదా తీవ్రమైనా వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం

## కంటి సమస్యలు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే..

వీటితో ఎన్నో ఉపయోగాలు..



కళ్లు పొడిబారడం (డ్రై ఐ సిండ్రోమ్) ప్రస్తుతం చాలా మందిలో కనిపిస్తున్న సాధారణ సమస్య. ఎక్కువసేపు కంప్యూటర్, మొబైల్ స్క్రీన్‌లను చూడటం, ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడపడం, వయస్సు పెరగడం, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా పోషకాల లోపం వంటి కారణాల వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల కళ్లలో మంట, ఎర్రబడటం, మసకగా కనిపించడం, కనురెప్పలు అతుక్కుపోయినట్లు అనిపించడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే కొన్ని సహజమైన చిట్కాలు, సరైన ఆహారపు అలవాట్లు ఈ సమస్య నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. కళ్ల ఆరోగ్యానికి విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం అవసరం. ముఖ్యంగా విటమిన్ ఎ కంటి ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. క్యారెట్, బొప్పాయి, మామిడి, పాలకూర వంటి ఆకుకూరలు, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలను ఆహారంలో చేర్చడం వల్ల అవసరమైన పోషకాలు అందుతాయి. అలాగే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల కళ్లలో సహజంగా కన్నీటి ఉత్పత్తి మెరుగుపడి పొడిబారడం తగ్గే అవకాశం ఉంటుంది.

**ఈ చిట్కాలను పాటించాలి..**

కొబ్బరి నూనె కూడా డ్రై ఐ సమస్యలో కొంత ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, తేమను కాపాడే గుణాలు కళ్ల చుట్టూ ఉన్న చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడతాయి. రెండు నుంచి మూడు చుక్కల కొబ్బరి నూనెను కళ్ల చుట్టూ నెమ్మదిగా రెండు నుంచి మూడు నిమిషాలు మసాజ్ చేసి, చర్మం పూర్తిగా పీల్చుకునే వరకు వదిలేయాలి. అయితే నూనె నేరుగా కంట్లో పడకుండా జాగ్రత్త వహించాలి. కీరదోస ముక్కలను కళ్లపై ఉంచడం కూడా ఉపశమనం కలిగించే చిట్కాల్లో ఒకటి. చల్లగా ఉంచిన కీరదోస ముక్కలను 15 నిమిషాల పాటు కళ్లపై ఉంచితే మంట, దురద, ఎర్రదనం తగ్గడంలో సహాయపడుతుంది. కీరదోసలో ఉండే విటమిన్ ఎ కళ్లకు పోషణ అందించడంలో ఉపయోగపడుతుంది. రోజూ ఒక గిన్నె పెరుగు తినడం కూడా కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పెరుగులో విటమిన్ డి, విటమిన్ బి, విటమిన్ ఎ వంటి పోషకాలు ఉండటంతో కళ్లకు అవసరమైన పోషణ అందించి పొడిబారడం వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఎక్కువ సేపు ఫోన్ లేదా కంప్యూటర్ చూస్తే..**

కళ్లను తరచూ రెప్పవేయడం కూడా చాలా ముఖ్యమైన అలవాటు. రెప్పవేయడం వల్ల సహజంగా కన్నీటి పొర కంటి ఉపరితలంపై సమానంగా వ్యాపించి తేమను నిలబెడుతుంది. ముఖ్యంగా కంప్యూటర్ లేదా మొబైల్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు ప్రతి కొద్ది నిమిషాలకు ఒకసారి రెప్పవేయడాన్ని అలవాటు చేసుకోవాలి. గోరువెచ్చని నీటిలో ముంచిన మెత్తని వస్త్రంతో కళ్లకు కాపడం పెట్టడం కూడా మంచి ఉపశమనం ఇస్తుంది. మెత్తని వస్త్రాన్ని గోరువెచ్చని నీటిలో ముంచి అదనపు నీటిని పిండి, కళ్లపై ఏడు నుంచి ఎనిమిది నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ రక్తప్రసరణ మెరుగుపడి సహజమైన తేమ ఉత్పత్తికి దోహదపడుతుంది. అయితే కళ్లు పొడిబారడం ఎక్కువకాలం కొనసాగితే, తీవ్రమైన నొప్పి, చూపు తగ్గడం లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించడం అవసరం.

# బిజినెస్

# ఐపీవోకి మర్రి రిటైల్

**హైదరాబాద్,**
జేసీ బ్రదర్స్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో దుస్తులను విక్రయిస్తున్న మర్రి రిటైల్స్ స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకోగా..శుక్రవారం అనుమతినిచ్చింది. తాజా షేర్లను జారీ చేయడం ద్వారా గరిష్ఠంగా రూ.522 కోట్ల నిధులను సేకరించాలని సంకల్పించింది. ఇందుకోసం కంపెనీ ప్రమోటర్ మర్రి వెంకట్ రెడ్డికి సంబంధించిన 2.7 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్నారు.ఈ వాటాల విక్రయం ద్వారా సమీకరించనున్న నిధులను రుణాలను తీర్చడానికి, కొత్తగా 10 దుస్తుల అవుట్‌లెట్లు, ఒకటి ఆభరణాలు–దుస్తుల అవుట్‌లెట్‌తోపాటు మరో రెండు ఆభరణాల స్టోర్లను తెరువడానికి ఖర్చు చేయబోతున్నది. వీటితోపాటు జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్, టంబో ఇమేజింగ్ ఇండియా, గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్ ఐపీవోలకు కూడా సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.




## ఫోక్స్‌వ్యాగన్ వర్ట్యూస్‌పై ప్రత్యేక ఆఫర్లు




**ముంబై,**
దేశీయ మార్కెట్లో అడుగుపెట్టి నాలుగేండ్లు పూర్తైన సందర్భంగా వర్ట్యూస్ మాడల్‌పై ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు ఫోక్స్‌వ్యాగన్ ప్రకటించింది. 2022లో దేశీయ రోడ్లపైకి అడుగుపెట్టిన ఈ మాడల్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించిందని, ప్రతి 24 నిమిషాలకు ఒక మాడల్ అమ్ముడైందని పేర్కొంది.ఈ సందర్భంగా కొనుగోలుదారులకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం కొనుగోలు చేయండి..చెల్లింపులు తర్వాత చేయండి అనేదానితోపాటు లాయల్టీ ప్రయోజనాలు, ప్రత్యేక వార్షికోత్సవ ఆఫర్లు, అలాగే డాక్టర్లు, సీఏలకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు కంపెనీ బ్రాండ్ డైరెక్టర్ నితిన్ కోహ్లీ తెలిపారు. డిజైన్, స్పేసియస్ క్యాబిన్, టీఎస్‌ఐ ఇంజిన్, ప్రీమియం సెడాన్‌లో భద్రతా ఫీచర్లకు పెద్దపీట వేసినట్టు చెప్పారు.

## రెండోరోజూ అదే జోరు..
## ఒక్క శాతానికి పైగా పెరిగిన సూచీలు

**ముంబై,**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థలు ర్యాలీ కొనసాగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు క్రూడాయిల్ ధరలు దిగిరావడం, ఐటీ షేర్లు కూడా కదంతొక్కడం వారాంతపు ట్రేడింగ్‌లో సూచీలు భారీగా లాభపడ్డాయి. దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ అంచనాలకు మించి రాణించడంతో ఐటీ రంగ షేర్లకు మదుపర్ల నుంచి మద్దతు లభించింది. దీంతో ఇంట్రాడేలో 900 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 827.57 పాయింట్లు లేదా 1.08 శాతం అందుకొని 77,569.39 వద్ద నిలిచింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 244.10 పాయింట్లు లేదా 1.02 శాతం ఎగబాకి




24,206.90 వద్ద స్థిరపడింది.బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లతోపాటు జియోఫైనాన్స్, హెచ్‌ఏఎల్, బజాజ్ ఫైనాన్స్, అదానీపోర్ట్స్, ఇండిగో, ఎల్‌అండ్‌టీ, విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడగా..డాక్టర్ రెడ్డీస్, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, సిప్లా, సన్‌ఫార్మా, కోల్ ఇండియా, టీవీఎస్ మోటర్, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా రియల్టీ సూచీ అత్యధికంగా 3.40 శాతం లాభపడగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ 3.26 శాతం, ఫోకస్డ్ ఐటీ 2.29 శాతం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 2.01 శాతం, మెటల్ 1.55 శాతం, సర్వీసెస్ 1.50 శాతం చొప్పున అధికమయ్యాయి. ఈ వారంలో సెన్సెక్స్ 194.52 పాయింట్లు, నిఫ్టీ 63.95 పాయింట్లు పతనం చెందాయి.

---

## చెన్నై సూపర్ కింగ్స్ గడ్డపై బిగ్‌బాష్ లీగ్..

### -డిసెంబర్‌లో ఆరంభ పోరు..!

క్రికెట్‌ను ఎంతో ప్రేమించే భారత్‌లో మరో మరో టీ20 లీగ్ మ్యాచ్ అభిమానులను అలరించనుంది. మన ఐపీఎల్ తరహాలో ఆస్ట్రేలియా గడ్డపై జరిగే బిగ్‌బాష్ లీగ్‌ను తొలిసారి భారత గడ్డపై నిర్వహించనున్నారు. డిసెంబర్ 12న ఆరంభ పోరుకు చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదిక కానుంది. ఇరుదేశాల ప్రధానులు నరేంద్ర మోడీ, ఆంటోనీ అల్బనీస్‌ల భేటీ అనంతరం చెన్నైలో బీబీఎల్ మ్యాచ్‌పై స్పష్టత వచ్చింది.భారత్, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా కొన్ని కార్యక్రమాల మార్పిడి ఒప్పందం కొనసాగుతోంది. ఈక్రమంలోనే క్రికెట్‌కు విశేషమైన ఆదరణ కలిగిన ఇండియాలో బీబీఎల్ మ్యాచ్ నిర్వహణకు క్రికెట్ ఆస్ట్రేలియా ఆసక్తి చూపింది. అందుకు.. బీసీసీఐ , తమిళనాడు క్రికెట్ సంఘం సైతం అంగీకారం తెలపడంతో ఆరంభ మ్యాచ్‌కు చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదిక కానుంది. డిసెంబర్ 12న తొలిపోరులో డిఫెండింగ్ ఛాంపియన్ పెర్త్ స్కార్చర్స్, మెల్‌బోర్న్ రెనెగ్రేడ్స్




తలపడనున్నాయి.‘భారత్‌లో బీబీఎల్ నిర్వహించడం సరైంది అనిపించకపోవచ్చు. క్రికెట్‌కు విశేషమైన ఆదరణ ఉన్న ఇండియాలో ఆడడం ఎవరికైనా ఇష్టమే. ఐపీఎల్‌కు ఆసీస్‌లో ఎంతో క్రేజ్ ఉంది. అలానే.. బీబీఎల్‌కు మరింత గుర్తింపు తేవడం కోసం ఆరంభ పోరును చెన్నైలో నిర్వహిస్తున్నాం’ అని బీబీఎల్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ అలిస్టర్ డాబ్సన్ పేర్కొన్నాడు.

**‘మే’లో పరిశీలన..**
బీబీఎల్‌కు మరింత క్రేజ్ తీసుకురావాలనే ఉద్దేశంతో భారత్‌లో మ్యాచ్ జరపాలని క్రికెట్ ఆస్ట్రేలియా భావించింది. అందుకు టీ20లను అమితంగా ఇష్టపడే చెన్నైని వేదికగా ఎంచుకున్న సీఏ.. చెన్నైలో వసతులు, పరిస్థితుల్ని స్వయంగా చూసి తెలుసుకునేందుకు మే నెలలో తమ బృందాన్ని పంపింది. బీబీఎల్ బృందం, క్రికెట్ ఆస్ట్రేలియా ప్రతినిధుల బృందం చిదంబరం స్టేడియంలో మ్యాచ్ నిర్వహణ, ప్రేక్షకుల ఆదరణ వంటి విషయాలను పరిశీలించింది. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మిన్హాస్, తాత్కాలిక సీఈఓ హేమంగ్ అమిన్ హాజరై పరిస్థితులను వివరించారు.

# స్పోర్ట్స్

## చరిత్ర సృష్టించిన ఎంబాపే..

### 30 ఏళ్లలోపే 20 గోల్స్‌తో రికార్డు..!



ఫిఫా వరల్డ్‌కప్‌లో కిలియన్ ఎంబాపే చరిత్ర సృష్టించాడు. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మెగా ఈవెంట్‌లో గోల్డెన్ బూట్ రేసులో దూసుకెళ్తున్న ఎంబాపే.. ఎనిమిదో గోల్ సాధించాడు. ప్రపంచకప్‌లో ఈ అతడికిది 20వ గోల్ కావడం విశేషం. తద్వారా 30 ఏళ్లలోపే ఈ మెగా టోర్నీలో 20 సార్లు బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపిన తొలి ఆటగాడిగా ఎంబాపే చరిత్రకెక్కాడు.సాకర్ ఆటలో అతిపెద్ద పండుగైన ఫిఫా వరల్డ్‌కప్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపే గోల్స్‌తో రెచ్చిపోతున్నాడు. గత సీజన్ రన్నరప్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందించాలనే కసితో ఉన్న ఎంబాపే.. ఎనిమిదో గోల్‌తో గోల్డెన్ బూట్ రేసులోకి దూసుకొచ్చాడు.క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై రెండో అర్ధ భాగంలో బంతిని ప్రత్యర్థి నెట్‌లోకి పంపిన ఫ్రాన్స్ కెప్టెన్.. ఈజిప్ట్‌పై గోల్‌తో టాప్‌లో కొనసాగుతున్న అర్జెంటీనా కెప్టెన్లి యోనల్ మెస్సీ(౮ఆశీఅవశ్రీ వీవం౦ఱ)తో సమంగా నిలిచాడు. వరల్డ్‌కప్ అంటే చాలు చెలరేగిపోయే ఎంబాపే మొరాకోపై మెరుపు గోల్‌తో 30 ఏళ్లలోపే వరల్డ్‌కప్‌లో 20 గోల్స్ సాధించిన తొలి ఆటగాడిగానూ రికార్డు సొంతం చేసుకున్నాడు. మెస్సీ కూడా 21 గోల్స్‌తో తాను తక్కువేమీ కాదని నిరూపించుకున్నాడు.

ఎంబాపే గోల్స్..
గ్రూప్ దశలో -- సెనెగల్‌పై- రెండు గోల్స్.
గ్రూప్ దశలో -- ఇరాక్‌పై- రెండు గోల్స్.
32వ రౌండ్‌లో -- స్వీడెన్‌పై -- రెండు గోల్స్.
16వ రౌండ్‌లో -- పరాగ్వేపై -- ఒక గోల్.
క్వార్టర్ ఫైనల్లో -- మొరాకోపై -- ఒక గోల్.

## టీ20 సిరీస్ చేజారడంపై బీసీసీఐ గరంగరం..
## సమీక్షకు సిద్ధమవుతున్న బోర్డు..!

టీ20ల్లో మొన్నటివరకూ అజేయశక్తిగా కొనసాగిన భారత జట్టు వరసగా రెండో సిరీస్ కోల్పోవడం అభిమానులకు మింగుడుపడడం లేదు. వరల్డ్‌కప్ ఛాంపియన్ టీమిండియా ఇంత దారుణంగా ఓడడంపై మాజీలు, విశ్లేషకులు అవాక్కవుతున్నారు. బ్రిస్టల్‌లో ఘనమైన రికార్డు ఉన్నప్పటికీ నాలుగో టీ20లో 9 వికెట్లతో చిత్తైన భారత్ సిరీస్ కోల్పోయింది. ఈ ఘోర పరాజయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి సీరియస్‌గా తీసుకుంది. సిరీస్ ముగియడమే ఆలస్యం సమీక్ష నిర్వహించి.. ఆటగాళు ,, కోచింగ్ సిబ్బందిపై చర్యలకు తీసుకోనుంది.ఇంగ్లండ్ పర్యటనలో హ్యాట్రిక్ ఓటములతో భారత జట్టు పొట్టి సిరీస్‌ను సమర్పించుకుంది. సిరీస్‌లో నిలవాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో 9 వికెట్ల పరాజయంతో విమర్శలకు కేంద్రంగా మారింది టీమిండియా. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్, ఆపై ఇంగ్లీష్ టీమ్ దెబ్బకు తలవంచిన భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ సమీక్షకు సిద్ధమవుతోంది. ఐదు టీ20ల సిరీస్ ముగియడమే ఆలస్యం ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శన, కోచ్ గౌతం గంభీర్, ఇతర సహాయక సిబ్బంది పనితీరును విశ్లేషించనుంది.‘టీ20ల్లో భారత జట్టు ప్రదర్శన పట్ల



ఆందోళన చెందుతున్నాం. ఇంగ్లండ్ సిరీస్ ముగియగానే కెప్టెన్ కోచ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిస్తాం. అసలు పొరపాటు ఏం జరిగింది? ఎందుకు సిరీస్ ఓడాం? అనేది ఆరా తీస్తాం. తప్పులను సరిదిద్దుకొని మళ్లీ జట్టుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం’ అని బీసీసీఐ సెక్రటీ దేవజిత్ సైకియా పేర్కొన్నాడు.

**శాంసన్‌ను తప్పించడం**
స్వదేశంలో టీ20 ప్రపంచకప్ సాధించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి.. శ్రేయాస్ అయ్యర్‌కు పగ్గాలు ఇవ్వడం బెడిసికొట్టింది. అలానే ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాలు దూరమవ్వడం భారత జట్టుకు ప్రతికూలంగా మారగా.. వైభవ్ సూర్యవంశీ కోసం సంజూ శాంసన్‌ను తప్పించడం పెద్ద పొరపాటని స్పష్టమైంది.అలానే.. కోచ్‌గా గంభీర్ పనితీరు కూడా ఆశించిన స్థాయిలో లేదు. అతడి నేతృత్వంలో ఆటగాళ్లను పరీక్షించడం ఓ అలవాటుగా మారడం, ప్రతిభావంతులను పక్కన పెట్టేయడం వంటివి విమర్శలకు తావిస్తోంది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కప్ 2027 అనంతరం గౌతీ భవితవ్యం కూడా తేలిపోనుంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కనకరాజు వచ్చేస్తున్నాడమ్మీ..

## వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' రిలీజ్ డేట్ ఫిక్స్!



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరికొత్త ప్రయోగాలతో దూసుకుపోతున్నారు. వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఈ సారి టాలీవుడ్‌లో ఇప్పటివరకు రాని ఒక వినూత్నమైన కాన్సెప్ట్‌తో ముందుకు వస్తున్నారు. వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు'. టాలీవుడ్ హిస్టరీలోనే సరికొత్తగా ఒక ఇండో-కొరియన్ హారర్ కామెడీ జానర్‌లో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను తాజాగా చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. 2026 ఆగస్టు 7వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'కనకరాజు వచ్చేస్తున్నాడమ్మీ' అంటూ విడుదల చేసిన ఈ క్రేజీ అప్‌డేట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోందిఈ చిత్రానికి దర్శకుడు మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. తనదైన మార్క్ కామెడీతో ప్రేక్షకులను నవ్వించడంలో దిట్ట అయిన గాంధీ, ఈ సారి హారర్ ఎలిమెంట్స్‌కు కొరియన్ బ్యాక్‌డ్రాప్‌ను జోడించి ఈ 'కోకా' చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. వరుణ్ తేజ్ సరసన ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా, స్టార్ కామెడియన్ సత్య కీలక పాత్రలో నటిస్తూ ప్రేక్షకులను పొట్టచెక్కలయ్యేలా నవ్వించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి టాలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు టి-సిరీస్ సౌత్ బ్యానర్లపై రాజీవ్ రెడ్డి, వంశీ, మనోజ్ రెడ్డి సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. స్టార్ డైరెక్టర్ క్రిష్ జగర్లమూడి ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా వ్యవహరిస్తుండటం విశేషం. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సత్య జి. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వరుణ్ తేజ్ కెరీర్‌లోనే ఇదొక అత్యంత క్రేజీ మరియు వైల్డెస్ట్ రైడ్‌గా నిలుస్తుందని మేకర్స్ నమ్మకంగా చెబుతున్నారు. కొరియన్ కల్చర్‌కు, మన లోకల్ కామెడీకి నడుమ సాగే ఈ హారర్ కామెడీ థ్రిల్లర్ ప్రేక్షకులకు ఒక సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఆగస్టు 7న థియేటర్లలో సందడి చేయబోతున్న ఈ కొరియన్ కనకరాజు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తాడో చూడాలి.



# ఒళ్లు గగుర్పొడిచేలా కొరియన్ థ్రిల్లర్ 'హోప్' ట్రైలర్!




హారర్ మరియు సస్పెన్స్ చిత్రాల ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునేలా ఒక సరికొత్త కొరియన్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'ది వైలింగ్', 'ది ఎల్లో సీ' వంటి మైండ్ బ్లోయింగ్ సినిమాలను అందించిన దర్శకుడు నా హాంగ్-జిన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'హోప్' చిత్రం యొక్క అఫీషియల్ ట్రైలర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో దక్షిణ కొరియాలోని ఒక మారుమూల గ్రామం 'హోప్ హార్బర్' నేపథ్యంలో కథ సాగుతుంది. గ్రామంలో హఠాత్తుగా ఎంట్రీ ఇచ్చి విధ్వంసం సృష్టిస్తున్న ఒక రహస్యమైన వింత జీవిని పట్టుకోవడానికి పోలీస్ చీఫ్ బమ్-సియోక్ (హ్వాంగ్ జంగ్-మిన్), ఆఫీసర్ సంగ్-ఏ (హోయోన్) రంగంలోకి దిగుతారు. అదే సమయంలో సమీపంలోని అడవిలో సంగ్-కి (జో ఇన్-సంగ్) నేతృత్వంలోని వేటగాళ్ల బృందం కూడా ఆ వింత జీవిని వేటాడటానికి బయలుదేరుతుంది. కానీ, అక్కడ పరిస్థితులు పూర్తిగా తారుమారై ఆ జీవిని వేటాడబోయిన వారే దానికి బలవుతుంటారు. ఒక చిన్న అపోహ, అజ్ఞానంతో మొదలైన ఈ సంఘర్షణ.. మానవజాతి మధ్య వివాదాలకు దారితీసి, చివరికి ఊహించని ఒక సృష్టి విపత్తుగా ఎలా మారింది అనేదే ఈ చిత్ర కథాంశం. ఒళ్లు గగుర్పొడిచే యాక్షన్ సన్నివేశాలు, అత్యద్భుతమైన విజువల్స్‌తో కూడిన ఈ మోస్ట్ అవేటెడ్ చిత్రం సెప్టెంబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఫౌజీ' రిలీజ్‌కు ముందే రికార్డు బిజినెస్..

## -ప్రభాస్ సినిమాకు భారీ ఓటీటీ డీల్?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఫస్ట్ లుక్, టైటిల్ గ్లింప్స్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొల్పిన ఈ చిత్రం, ఇప్పుడు రిలీజ్‌కు ముందే నాన్-థియేట్రికల్ బిజినెస్‌తో ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా సౌత్ ఇండియన్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సుమారు రూ.180 కోట్లకు సొంతం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో హిందీ థియేట్రికల్ హక్కులను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏఏ ఫిలింస్ రూ.60 కోట్లకు పైగా చెల్లించి దక్కించుకున్నట్లు కూడా టాక్ వినిపిస్తోంది.అయితే, ఈ ఒప్పందాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు ట్రేడ్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. హిందీ డిజిటల్ హక్కులతో పాటు శాటిలైట్, ఆడియో రైట్స్‌కు సంబంధించిన ఒప్పందాలు ఇంకా పూర్తి కాలేదని తెలుస్తోంది. అవి కూడా పూర్తయితే, 'ఫౌజీ' విడుదలకు ముందే భారీ స్థాయిలో నాన్-థియేట్రికల్ బిజినెస్ నమోదు చేసే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 'సీతారామం'తో ప్రశంసలు అందుకున్న దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని 1930ల కాలం నాటి చారిత్రక నేపథ్యంతో రూపొందిస్తున్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, యుద్ధ వాతావరణం, దేశభక్తి అంశాలను ప్రధానంగా తీసుకుని కథను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ప్రభాస్ ఓ బెటాలియన్ నాయకుడి పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. యాక్షన్‌తో పాటు భావోద్వేగాలు, స్పై థ్రిల్లర్ అంశాలు కూడా కథలో కీలకంగా ఉండనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన కొత్త హీరోయిన్ ఇమాన్వీ నటిస్తుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో సినిమా తెరకెక్కుతోందని ప్రచారం జరుగుతోంది. ఇటీవల నిర్మాత నాగవంశీ కూడా ఈ సినిమా గురించి మాట్లాడుతూ, ఇప్పటివరకు భారతీయ ప్రేక్షకులు చూడని కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రమని, హను రాఘవపూడి ఎంతో విభిన్నమైన స్థాయిలో ఈ కథను తెరకెక్కిస్తున్నారని చెప్పారు. అన్ని పనులు అనుకున్న ప్రకారం పూర్తయితే డిసెంబర్ 3న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



# నా హాట్ పిక్స్ ఆశించి రావద్దు..

## -ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్‌పై స్పందించిన పాయల్ రాజ్‌పుత్!

టాలీవుడ్ బోల్డ్ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ ఛానెల్‌కు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి గట్టిగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఇటీవల కాలంలో సెలబ్రిటీలు తమ అభిమానులకు మరింత దగ్గరవ్వడానికి ప్రత్యేకంగా సబ్‌స్క్రిప్షన్ ఛానెళ్లను ప్రారంభిస్తున్న సంగతి తెలిసిందే. అయితే పాయల్ రాజ్‌పుత్ ప్రారంభించిన ఈ ఛానెల్‌పై నెట్టింట కొన్ని తప్పుడు అపోహలు, ప్రచారాలు మొదలయ్యాయి. దీనిపై ఆమె తాజాగా స్పందిస్తూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేయడమే కాకుండా, అసలు విషయం ఏంటనేది వివరించింది.చాలా మంది నెటిజన్లు, అభిమానులు తన సబ్‌స్క్రైబర్ ఛానెల్‌లో ఎలాంటి కంటెంట్ ఉండబోతోందని వరుసగా మెసేజ్‌లు చేస్తున్నారని, అందుకే అందరికీ ఒకేసారి క్లారిటీ ఇవ్వాలని భావిస్తున్నట్లు పాయల్ తెలిపారు. కేవలం ఎక్స్‌ప్లిసిట్ కంటెంట్, గ్లామరస్ లేదా 'హాట్ పిక్స్' ఆశించి ఎవరైనా తన ఛానెల్‌ని సబ్‌స్క్రైబ్ చేసుకోవాలనుకుంటే.. దయచేసి ఆ పని చేయవద్దని ఆమె స్పష్టం చేశారు. అలాంటి వారి కోసం ఈ వేదిక అస్సలు కాదని తేల్చి చెప్పారు. ఒక నటిగా కాకుండా, తెర వెనుక ఉండే తన అసలైన వ్యక్తిత్వాన్ని, నిజ జీవితంలోని అన్‌ఫిల్టర్డ్ క్షణాలను, తన రోజువారీ ప్రయాణాన్ని పంచుకోవడానికే ఈ ప్రత్యేక ఛానెల్‌ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేవలం తనను ఒక వ్యక్తిగా ఇష్టపడేవారికే ఈ స్పేస్ స్వాగతం పలుకుతుందని పాయల్ అన్నారు. ఒక మహిళగా, నటిగా తన వ్యక్తిగత హద్దులను అర్థం చేసుకుని, వాటిని గౌరవిస్తున్న ప్రతి ఒక్క అభిమానికి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10, Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465